Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

జిమ్మీకైమ

పాగతోట, నెల్లూరు - 524 001.

ప్రకటనలకు

98489 66163

98489 66165

చందాలకు

98489 66190

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జిమ్మీకైమ

సంపుటి: 82 • సంచిక: 29 • 22-7-2011 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



a *** hotel with 5 star comforts

D.R. UTTHAMA HOTEL

Winner of Excellence Award 2004, 2005 & 2006

G.T.Road, Nellore - 524 003.(A.P)

Ph: 0861 - 2317777

email - drutthama@yahoo.co.in

● జగన్‌పై కేసు...

తిండి సగించని పారిశ్రామికవేత్తలు!

జగన్ పుణ్యాన సిబిఐకి చేతినిండా పని తగిలింది. క్షణం తీరిక లేని వ్యాపకం కుదిరింది. ఒక పక్క జగన్ సంస్థలలో పెట్టుబడులు పెట్టిన కంపెనీల నుంచి కట్టలు కట్టలుగా కాగితాలు వచ్చి పడుతున్నాయి. మరొక ప్రక్క సెక్రటరియేట్ అధికారులు జగన్ అనుకూల కంపెనీలకు ప్రభుత్వం దోచి పెట్టిన భూములు, గనుల ఫైళ్లను బండ్ల కెత్తి, సిబిఐ ఆఫీసులో దింపుతున్నారు. వైఎస్ బ్రతికి వున్నప్పటి నుంచీ ఈ వ్యవహారాలపై పత్రికలు, ప్రతిపక్షాలు ఎన్నోసార్లు అరిచి గోల పెట్టాయి. కానీ ఫలితం లేదు. ఇప్పుడు హైకోర్టు కొరడా జుళిపించడంతో సమాధుల నుంచి అస్తిపంజరాలు వెలికి వస్తున్నాయి. ఈ పరిణామంతో పారిశ్రామికవేత్తలకు తిండి సగించడం లేదు. నిద్ర పట్టడం లేదు. వురుము వురిమి మంగళం మీద పడ్డట్లు, జగన్ మీద కేసులతో తమ కొంపకు నిప్పంటుకొంటుందన్నది వీరి భయం. సిబిఐ అధికారుల దృష్టి ఇప్పటివరకు జగన్ సంబంధిత వ్యవహారాల మీద మాత్రమే వుంది. కానీ, సూది కోసం సోదెకు పోతే పాత రంకులన్నీ బయటపడ్డట్లు, వారి పరిశీలనలో తమ ఆర్థిక మూలాలు వెలికి వస్తాయన్నది పారిశ్రామికవేత్తల భయం.

చాలా కాలం క్రితమే చాలినన్ని ఆధారాలు

హైకోర్టు ఆదేశాలతో జగన్ అక్రమాల లోతును వెతకడానికి సిబిఐ రంగంలోకి దిగింది. కానీ అంతకు చాలా క్రితమే సిబిఐతో పాటుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, రెవిన్యూ ఇంటెలిజెన్స్, ఐబి వంటి సంస్థలు జగన్ అక్రమాల లోతులు వెతికి పెట్టి వున్నాయని చెప్తున్నారు. వారి దగ్గర చాలా ఆధారాలే వున్నాయనీ అంటున్నారు. అయితే రాజకీయాలు ముడిపడిన అంశం కావడంతో, ఏ అధికారి కూడా తొందరపడలేదు. ఇప్పుడు హైకోర్టు వారికా స్వేచ్ఛ ఇచ్చింది. హైకోర్టు చెప్పింది కాబట్టి,

కొరవ 14వ పేజీలో



ఉత్తరక్రియలు

ఆప్యాయతానురాగాలతో మా మనస్సులలో చెరగని ముద్రవేసుకొన్న

అమృతమూర్తి, సహృదయులు శ్రీ **పానకా లక్ష్మినరసారెడ్డి** గారు

తేది 17-7-2011 ఆదివారం నాడు స్వర్గస్తులైనారు.

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని

ప్రార్థిస్తూ... అశ్రునయనాలతో...

శ్రీ పానకా లక్ష్మినరసారెడ్డి గారు

జననం: 28-8-1936 ❁ మరణం: 17-7-2011

అక్కలు - బావలు

మేనకూరు సరస్వతమ్మ - కృష్ణారెడ్డి

లేట్ చెన్నారెడ్డి సరోజనమ్మ - గోపాలరెడ్డి

చెల్లెళ్లు - బావలు

ముంగమూరు ఇందిరమ్మ - లేట్ వెంకట-శివరామిరెడ్డి

లేట్ గండవరపు లలితమ్మ - డాక్టర్ వీరారెడ్డి

మేనళ్లుళ్లు

మేనకూరు సురేష్‌రెడ్డి - శ్రీకళ

చెన్నారెడ్డి రవీంద్రరెడ్డి - సుచిత్ర

చెన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి - సీత

ముంగమూరు జగన్మోహన్‌రెడ్డి - సుమన

ముంగమూరు సుకేష్‌రెడ్డి - మాలిని

గండవరపు అమరేంద్రరెడ్డి - సుమలత

మేనకోడలు: గర్తం అర్చన - రవీంద్రరెడ్డి

ఉత్తరక్రియలు

తేది 26-7-2011 మంగళవారం నిలుపు, తేది 27-7-2011 బుధవారం ఎత్తురేవు నెల్లూరు జిల్లా, దామరమడుగులోని వారి స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

కొత్త దేశం పుట్టింది

ప్రపంచంలో మరొక కొత్త దేశం పురుడు పోసుకొన్నది. ఆఫ్రికా ఖండం ఉత్తర దిక్కు కొనలో, ఈజిప్టును ఆనుకొని వుండే సూడాన్ దేశం రెండుగా చీలిపోయి, దక్షిణ సూడాన్ అనే కొత్త దేశం ఆవిర్భవించింది. దానితో ఐక్యరాజ్య సమితిలోని దేశాల సంఖ్య 193కి పెరిగింది.

సూడాన్ ఆవిర్భావం ఆఫ్రికా ఖండ రాజకీయాలకు, ఆ ఖండంతో భారతదేశ ఆర్థిక సంబంధాలకు ఎంతో కీలక పరిణామం. ఆఫ్రికా ఖండంలోని 53 దేశాలతో పాటుగా సూడాన్‌కు కూడా 1954లో బ్రిటీష్ పాలన నుంచి విముక్తి లభించింది. కానీ సూడాన్‌లోని భిన్న జాతుల మధ్య ఏకీభావం కుదరక పోవడంతో అప్పటి నుంచీ అంతర్యుద్ధాలతో అతలాకుతలం అవుతున్నది. ఉత్తర సూడాన్‌లో అరబ్ దేశాల నుంచి వలస వచ్చిన అరబ్‌లు, దక్షిణ సూడాన్‌లో సాంప్రదాయక గిరిజనులు, క్రైస్తవులు నివసిస్తున్నారు. వీరిద్దరి మధ్య పొత్తు పొసగలేదు. దాదాపు యాభై ఏళ్లపాటు జరిగిన అంతర్యుద్ధాల ఫలితంగా 20లక్షల మందికి పైగా మరణించారు. దేశంలో అభివృద్ధి అన్న పదానికి తావు లేకుండా పోయింది. మిగిలిన జనానికి ఆకలి చావుల శాపం. చదువు అన్న మాటే లేదు. రోగం వస్తే దేముడే దిక్కు.

అయితే సూడాన్‌లో అపారమైన ప్రకృతి వనరులున్నాయి. బంగారు, ఇనుము, రాగి, మైకా గనులు అనంతం. చెప్పుకోదగిన పెట్రోల్ నిల్వలున్నాయి. అన్నిటికీ మించి నైలు నది వుంది. దానికి ఆనుకొని సుక్షేత్రమైన మాగాణి భూములున్నాయి. వాటిలో పంట పండిస్తే, మొత్తం ఆఫ్రికా ఖండానికి సరిపడా ఆహార ధాన్యాలు ఉత్పత్తి అవుతాయి. దక్షిణ సూడాన్ ప్రజలు వ్యవసాయానికి భూమి కొనుగోలు చేయవలసిన అవసరం లేదు. వారెంత దూరం చెట్టు పుట్ట కొట్టి, భూమి చదును చేసుకోగల్గితే అంత మేరా వారికి భూమి కేటాయిస్తుంది ప్రభుత్వం. సంవత్సరంలో ఆరు నెలలు వానలు కురిసే దేశం కావడం, కొన్ని వేల సంవత్సరాలుగా నైలు నదీ ప్రవాహం వల్ల సారవంతమైన నేలలు ఏర్పడడంతో ఆ నేలల్లో బంగారు పంటలు పండుతాయి. వీటికి తోడుగా సూడాన్‌లో పెట్రోల్ నిల్వలు సైతం వున్నాయి.

సూడాన్ అంటే ఎందువల్లనో కానీ, జవహర్‌లాల్ నెహ్రూ ఎంతో అభిమానించేవారు. 1955లో జరిగిన ఆఫ్రో ఆసియా దేశాధినేతల సమావేశంలో ఆయన తన చేతి రుమాలు మీద సూడాన్ అని వ్రాసి, పక్క సీటులో వేసి, ఆ దేశాధినేతను పిలిచి కూర్చోబెట్టుకొన్నాడట. ఇప్పటికీ సూడాన్ రాజకీయవాదులు ఆ సన్నివేశాన్ని గొప్పగా చెప్పుకొంటూ వుంటారు. ఆఫ్రికా ఖండంలోని అపారమైన ప్రకృతి వనరులను ఆర్థిక లాభంగా మలచుకోవడానికి భారత్, చైనా దేశాల మధ్య తీవ్ర పోటీ నడుస్తున్న విషయం తెలిసిన సంగతే. ఆ దిశలో సూడాన్‌లో భారతీయ వ్యాపారులకు అలివిమాలిన అవకాశాలున్నాయని చెప్తున్నారు. అందువల్లనే ప్రపంచంలో అందరికంటే ముందు భారత ప్రభుత్వం దక్షిణ సూడాన్ దేశ ఆవిర్భావాన్ని గుర్తించింది. వారి స్వాతంత్ర్య దినోత్సవాలలో పాల్గొనడానికి ఉపరాష్ట్రపతి అన్సారీని ప్రత్యేకంగా పంపింది.

సూడాన్‌కు ఇప్పుడు అత్యవసరంగా కావల్సింది – రోడ్లు, బడులు, ఆస్పత్రుల నిర్మాణం. ఆ ప్రాథమిక వసతులు నిర్మిస్తే, అక్కడున్న అపారమైన ఖనిజాలను వెలికి తీయవచ్చు. భారతీయ పారిశ్రామికులకు అదొక సువర్ణ అవకాశమని చెప్తున్నారు. ఆపైన వ్యవసాయం. ఔత్సాహిక రైతులను పెద్ద సంఖ్యలో అక్కడకు పంపాలని కేంద్ర ప్రభుత్వం తలపోస్తున్నది. ఇప్పటికే ఆఫ్రికా ఖండంలోని చాలా దేశాలలో భారతదేశం నుంచి వెళ్లిన రైతులు లక్షల విస్తీర్ణంలో భూమి తీసుకొని, వ్యవసాయం చేస్తున్నారు. తెగుళ్ల మందులు, రసాయన ఎరువులు వాడకుండా, పంటలు సాగు చేస్తుండడం వల్ల ఆ ఆహార ఉత్పత్తులకు అంతర్జాతీయ విపణిలో మంచి గిరాకీ లభిస్తున్నది. అయితే ఆ దేశాలలో భద్రత పెద్ద సమస్య. సూడాన్‌లో ఆ సమస్య వుండక పోవచ్చునని భావిస్తున్నారు. అందువల్ల భారీ విస్తీర్ణంలో భూములు సేకరించి, ఇరుగు పొరుగు దేశాల నుంచి కూలీలను సమీకరించి, బంగారు పంటలు పండించే అవకాశం వుంది. దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నది భారత ప్రభుత్వ ప్రణాళిక. సూడాన్‌లో మనుషుల సంఖ్య కంటే, పశువుల సంఖ్య అధికం. మన వలెనే వారు కూడా గోమాతను పూజిస్తారు. అందువల్ల కోట్ల సంఖ్యలో పశుసంపద పెరిగిపోయి వుంది. దాన్ని కూడా ఆర్థిక లాభంగా మలచుకొనే అవకాశం వుంది.

మొత్తం మీద నిరుపేదరికానికి, ఆకలి చావులకు, అంతర్యుద్ధాలకు, తీవ్రవాదానికి, అనారోగ్యపీడితులకు నిలయంగా ఇప్పటి వరకు ప్రపంచం ఈసడించుకొన్న సూడాన్ దేశం ఒక్కసారిగా పారిశ్రామికులకు స్వర్గధామంగా మారిపోయింది.

జమీన్‌రైతు

జనవాక్కు

భూవివాదాలలో మంత్రిపేరు

బోగోలు మండలంలో పాత ఎమ్మార్వో నిర్వాకంతో పలు గ్రామాలలో భూవివాదాలు ముదిరాయి. ఒకే పొలం ఇద్దరికి పట్టాలివ్వడం, ఇనాం భూములున్న గ్రామాలలో కోర్టులలో కేసులున్నా వాటిని చూడకుండానే ఇనాం రద్దు చట్టంతో పని లేకుండానే రైత్వారీ పట్టాలివ్వడం వంటి వింతలు చోటు చేసుకొన్నాయి. దీనివల్ల మండలంలోని గ్రామాలలో రైతుల మధ్య వివాదాలు తలెత్తాయి. ఈ సందర్భంలో ఒకటి రెండు చోట్ల మంత్రి మోపిదేవి వెంకటరమణ పేరు చెప్పుకోవడం, మంత్రిగారి పేరుతో రైతులను భయపెట్టడం జరుగుతున్నది. మండల రెవిన్యూ కార్యాలయం, పోలీసు స్టేషన్లలో ఇది మంత్రిగారి విషయం సర్దుక పొమ్మంటున్నారు. జిల్లా కలెక్టర్, జెసి, ఎస్పీ ఈ విషయంలో జోక్యం చేసుకొని సామాన్య, పేద రైతులకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోమని కోరుతున్నాను.

పి.శ్రీరాములు బోగోలు
మాజీ మండలాధ్యక్షుడు

ప్రజల పక్షం నిలవని నేతలు!

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, కిరోసిన్ వంటగ్యాస్ ధరలు మళ్లీ పెంచేసింది. దీనిమూలంగా నిత్యావసర వస్తువుల ధరలు అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్నాయి. పప్పుల ధరలతోపాటు వంట నూనె ధర కిలో వంద రూపాయలకు చేరింది. కూరగాయల ధరలు పెరిగాయి. చిన్నచిన్న ప్రైవేటు వుద్యోగులు పెరిగిన ఇళ్ల అద్దెలు, పిల్లల పాఠశాలల ఫీజులు భరించలేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు వాళ్ల తగవులాటలు, ఒకరినొకరు తిట్టుకోవడం తప్ప ప్రజల పక్షం నిలచి పోరాటాలు చేసే తీరిక లేదు. ఏదో మార్గాన కోట్లు గడించడం ఎన్నికల సమయంలో డబ్బు, దస్కం, కులం, మతం ఆధారంగా గెలిచేయడం మామూలైపోయింది.

ఎం.సుధామయి నెల్లూరు

పెంచిన జీతాలివ్వండి!

జిల్లా గ్రంథాలయ సంస్థలో ఎనిమిది మంది ఔట్ సోర్సింగ్ ఏజన్సీ ద్వారా వుద్యోగులుగా పని చేస్తున్నాం. ఈ యేడాది జనవరిలో విడుదలైన జిఓ నెం.3 ద్వారా లైబ్రేరియన్‌కు 8400 రూపాయలు, అసిస్టెంటుకు 8వేలు, అటెండర్‌కు 6700 నెలసరి వేతనంగా సవరించబడినాయి. మిగిలిన అన్ని శాఖలలో ప్రభుత్వం పెంచిన జీతాలు చెల్లిస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో మాత్రం పెరిగిన జీతాలు ఇవ్వకపోవడం దారుణం. ఈ విషయమై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని న్యాయం చేయాలి.

పి.అరుణకుమార్ నెల్లూరు

70 ఏళ్ల క్రితం ఈవారం

25-7-1941
పేజీలు : 10 వెల: అణా

గూడూరు

గుద్దేటి సుబ్రహ్మణ్యం గారి మీద కేసు 18వ తేదికి గెలిటీగారి కోర్టులో వాయిదాపడి వుండినది. సాక్ష్యములో భేదము కనిపించినందున 19వ తేదీన గెలిటిగారు నేరము జరిగిన చోటును స్వయముగా చూచిరి. ముద్దాయి కమ్యూనిస్టు కాదని రుజువు పరచుటకుగాను సాక్షుల లిస్టు దాఖలు చేసెను. 3వ తేదికి వాయిదా.

పంచాయితీ బోర్డు మెంబర్లపై ప్రాసిక్యూషన్

ఇస్కా రామయ్య నాయుడు గారు వగైరా ముగ్గురు ప్రతిఘటించారని ప్రెసిడెంటు గారు వీరి మీద ప్రాసిక్యూషన్ దాఖలు చేశారు. గెలిటీవారి కోర్టులో అది కూడా 30వ తేదీకే వాయిదా పడ్డది.

కొనగాళ్ల శేషాచలం శెట్టి

వీరు 22-4-41తేదీన ఇందుపూరు గ్రామంలో సత్యాగ్రహము చేసిరి. అందుకై వీరిని అరెస్టుచేసి కావలి పోలీసు లాకప్పులో ఉంచిరి. కొద్ది రోజులకు పిమ్మట వీరిపై ఛార్జిషీటు ధాఖలు చేయకయే విడుదల చేసిరి. మరల వీరు 22-7-41 తేది మద్రాసులో సత్యాగ్రహం చేయగా అరెస్ట్ కాబడిరి. వీరికి 4 మాసముల కఠిన శిక్ష, సి క్లాసు.

స్టూడియో వార్తలు

దేవత

మద్రాసు ప్యారాగన్ టాకీసులో మూడు వారాలుగా రన్ అవుతుంది. ప్రేక్షకులు ఏమీ తగ్గలేదు. ఆంధ్ర దేశంలో సెప్టెంబరు 11వ తేది రిలీజ్ చేస్తామా అని ఆలోచిస్తున్నారు. నెల్లూరులో మాత్రం డిసెంబరులోనే.

50 ఏళ్ల క్రితం ఈవారం

21-7-1961
పేజీలు: 12 వెల: 0-20 న.పై

రాష్ట్రపతి పరిస్థితి ఆందోళనకరం

రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఆరోగ్య పరిస్థితి అకస్మాత్తుగా ఆందోళనకరంగా పరిణమించింది. 19వ తేది సాయంకాలం ఒకసారి, 20వ తేది మధ్యాహ్నం ఒకసారి వారు రక్తం వాంతి జేసుకున్నారు. అవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్సకు అనుకూలంగా వుండుటకు నిన్న వారిని నర్సింగ్ హోంలో చేర్చారు. 20వ తేది రాత్రి ప్రశాంతంగా గడిపారని తెలుస్తున్నది. ఈ రోజు వారికి రక్తం ఎక్కించారు.

నెల్లూరు ముచ్చట్లు

పాల కల్తీకి జరిమానా

పాలల్లో నీళ్లు కలిపి విక్రయించిన నేరానికి నెల్లూరు సహకార పాల సరఫరా సంఘ అధ్యక్షునికి నెల్లూరు అడిషనల్ మునిసిఫ్ మేజిస్ట్రేటు విధించిన రూ. 100 జరిమానా, లేక రెండు నెలలు విడి ఖైదు అప్పీలులో జిల్లా సెషన్సు జడ్జి సమియుద్దీన్ మహమ్మద్ ఖాయపరుస్తూ 7వ తేది తీర్పు జెప్పారు.

ఈ పాల సరఫరా సంఘంలో ఇలాంటి అవినీతి అక్రమాలు, ధన దుర్వినియోగాలు విచ్చలవిడిగా సాగుతున్నవి. వీటినిరికట్టలేకుండా, సంఘాన్ని సక్రమంగా నిర్వహించలేకుండా ఒవ్వేటి విశ్వనాధరావు బోటి పెద్దలు ఆ సంఘ పదవులను అంటిపెట్టుకొని వుండడం ఈ విధంగా అపకీర్తి పొందుటకే గదా!

మరణం

నెల్లూరు వైశ్య ప్రముఖుడు, అనేక ధర్మ కార్యాలకు ఉదారంగా సహాయపడిన దాత వొమ్మిన శేషయ్య శెట్టి తన 95 ఏట కాలధర్మం చెందారు. వారి కుటుంబానికి మా సానుభూతి.

నెల్లూరు ముచ్చట్లు

ముఖ్యమంత్రి రాక!

ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తొలిసారిగా నెల్లూరు పర్యటనకు రానున్నారు. 24వ తేది ఉదయం నెల్లూరు నగరానికి వస్తారాయన. కాకుటూరులోని యూనివర్సిటీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, పొదల కూరురోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులకు శంకుస్థాపన, టిబి ఆసుపత్రి ప్రాంగణంలో కొత్త కలెక్టరేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. వేదాయపాళెంలో బాబు జగజ్జీవన్‌రామ్, కరంటాఫీసు సెంటర్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ఆవిష్కరిస్తారు. అనంతరం విఆర్ కాలేజి గ్రౌండ్‌లో జరిగే కౌలు రైతుల సభలో పాల్గొని, పినాకిని అతిథి గృహంలో మధ్యాహ్న భోజనం. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా అధికారులతో అభివృద్ధిపై సమీక్ష చేస్తారు. సాయంత్రం కాంగ్రెస్, పిఆర్పీ పార్టీ కార్యకర్తల సంయుక్త సమావేశంలో పాల్గొంటారు. రాత్రికి ఇక్కడే బసచేసి 25వ తేది హైదరాబాద్‌కు వెళ్తారు. ముఖ్యమంత్రి మనసు దోచెను ఆనం సోదరులు నగరంలో అట్టహాస స్వాగత సత్కార ఏర్పాట్లు చేస్తున్నారు.

వృక్ష విలాపం!

ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకొని గత నలభై ఏళ్లుగా పొదలకూరు రోడ్డు ప్రాంతంలో ఎందరికో నీడనిస్తుండిన పెద్ద పెద్ద వృక్షాలను జెసిబిల సహకారంతో వేర్లతో సహా పెకలించి వేశారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ తిరిగే ప్రాంతాలన్నింటిలోనూ ఇదే పరిస్థితి. రోడ్లపై మట్టి తొలగింపు, అతుకులు వేసే పనులు మహా జోరుగా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రులు వస్తేనే నెల్లూరు రోడ్లను శుభ్రపరిచే స్థాయికి కార్పొరేషన్ దిగజారి పోవడం బాధాకరం.

పిపి కారు హడావుడి!

పబ్లిక్ ప్రాసిక్యూటర్ అంటూ నెంబర్ ప్లేటున్న తెల్లకారొకటి జిల్లా కోర్టు ప్రాంగణంలో విపరీతంగా హారన్ మ్రోగిస్తూ తిరుగుతుంది. కోర్టు ప్రాంగణంలో స్కూటర్ల హారన్ మ్రోగించినా ఒప్పుకోరు. మరి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గారనా ఈ వెసలుబాటు?

వైస్ ఛాన్సలర్ పదవీ విరమణ

నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.ఆర్.విశ్వేశ్వరరావు ఈ నెల 27వ తేది పదవీ విరమణ చేయనున్నారు. 2008 జూలై 27వ తేది వైస్ ఛాన్సలర్ పదవిని స్వీకరించారాయన. యూనివర్శిటీ భవన నిర్మాణానికి స్థల సేకరణ, నిధుల సమీకరణకు యుజిసిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించబట్టే రేపటి ముఖ్యమంత్రి పర్యటనలో భవన నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుంది. వైస్ ఛాన్సలర్‌నంటూ పరిపాలన భవనంలోనే కూర్చోక నెల్లూరుకు తగిన కోర్సులు యూనివర్శిటీలో ప్రవేశ పెట్టడంతోపాటు అన్నివర్గాల మన్ననలు పొందారు విశ్వేశ్వరరావు. కొత్త ఛాన్సలర్‌కు కావాల్సినంత పని వుందిప్పుడు విక్రమ సింహపురి యూనివర్శిటీలో.

విలేకరులను తిట్టిన వివేకా!

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డికి తనను నిత్యం వార్తల్లో వుంచే విలేకరులపై కోపం వచ్చింది. తనదైన ధోరణిలో వారిని తిట్టి పెట్టారాయన. 16వ తేది కలక్టరేట్‌లోని గోల్డన్ జూబ్లీ హాల్‌లో జరిగిన సమీక్ష సమావేశానికి ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో విలేకరులకు ప్రవేశం లేకపోవడంతో సమీక్ష ముగించుకొని బయటకు వచ్చిన మంత్రి ముందు మైకులు పెట్టారు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు. ప్రశ్న – జవాబుల పరంపర వివేకాకు చిరెత్తించినట్లుంది. అంతే విలేకరులను ఉద్దేశించి మీరేమో శనివారమైనా నాన్‌వెజ్ భోజనం చేశారు. కడుపు నిండింది. మేము తిన బళ్లేదా అని తిట్లకు లంఘించారు. విలేకర్లకు ముందు భోజనం పెట్టిన జిల్లా అధికార్లపై కూడా రుసరుసలాడారాయన.

మానసిక వైద్యుల సంఘం నేత!

సైకియాట్రిస్ట్ డాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా నగరానికి చెందిన డాక్టర్ ఉదయ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఖమ్మంలో జరిగిన సైకియాట్రిస్టు డాక్టర్ల సమావేశంలో ఆయన్ను రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎంపిక చేయడం జరిగింది. గతంలో ఉదయకుమార్ జిల్లా అధ్యక్షునిగా కూడా పనిచేసివున్నారు.

దూరం... దూరం

మీడియాకు జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి దూరంగా వుంటున్నారు. తాను నిర్వహించే సమీక్ష సమావేశాలకు మీడియాను పిలవవద్దంటున్నారు. డిపిఆర్వోనే మీటింగ్ నోట్స్ వ్రాసి పంపమంటున్నారు. ఓటర్ల జాబితాలో కొంతమేర పొరపాట్లున్నాయన్న తన వ్యాఖ్యలను వక్రీకరించి మీడియా వ్రాసిందని కలెక్టర్ బాధపడుతున్నట్లు తెలిసింది. డిపిఆర్వో కార్యాలయంలో చక్కని నోట్స్ వ్రాసే అధికారులే లేరు. కలెక్టర్ వీరిపై భారంవేస్తే ఇంకొన్ని తలనొప్పులు ఖాయం.

కొరవ 14వ పేజీలో

స్వదేశాగమన శుభాకాంక్షలు



ప్రతిష్టాత్మక ఇంప్లాంట్స్ (కట్టుడుపళ్లు) కంపెనీ
ఆహ్వానం మేరకు ఫ్రాన్స్ దేశ పర్యటనను దిగ్విజయంగా
పూర్తి చేసుకొని,ఇంప్లాంట్స్ విధానంలో నూతన ప్రక్రియలను
అధ్యయనం చేసి స్వదేశానికి విచ్చేయుచున్న సందర్భంగా
డా॥జి. మదన్‌మోహన్‌రెడ్డి గారికి
ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు
40 YEARS OF EXCELLENCE
డాక్టర్లు మరియు సిబ్బంది
డాక్టర్ జి.కొండారెడ్డి సూపర్‌స్పెషాలిటీ దంతవైద్యశాల
బృందావనం, నెల్లూరు - 524 001. ఫోన్ : 0861 - 2327235

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్ : 2331133, 2327611

వెండి స్పెషల్ ఆఫర్
925 STERLING SILVER
(EXPORT QUALITY)
ఆంధ్రలోనే మెగా వెండి షోరూం
సిల్వర్ ప్లాజా
EXCLUSIVE SILVER SHOW ROOM
A Unit of Gold Palace
హోటల్ శివం ఎదురుగా
ఆచారివీధి, జిల్లాపరిషత్ సెంటర్, నెల్లూరు.
ఫోన్ : 2331132, 2331121

హెచ్చరిక నోటీసు

నా క్లయింట్ అయిన శ్రీ **పోలంరెడ్డి వేణుగోపాలరెడ్డి**, తండ్రి **ఈశ్వర రెడ్డి,** చెన్నై వారి అనుమతి మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా:

నెల్లూరుసిటీ కాపురస్తులు 1) **చెరుకుముడి రామచంద్రయ్య** 2) **చెరుకుముడి క్రిష్ణయ్య** 3) **కొల్లి లక్ష్మీశ్రీధర్‌రెడ్డి** మరియొకరిపై నా క్లయింటు గౌరవనీయులైన **ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో** A.S.నెం.**243/2010**రుగా ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి వ్యాజ్యము నడుపుచున్నారు. గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారు A.S.M.P.నెం. **1189/2010**లో యీ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పరాధీనములు చేయకుండా తాత్కాలిక ఇంజక్షన్ ఉత్తర్వులు తే**16-6-2010**దిన జారీ చేసియున్నారు. దరిమిలా సదరు తాత్కాలిక ఇంజక్షన్ ఉత్తర్వులను తే**14-6-2011**దిన పర్మినెంట్ ఇంజక్షన్ ఉత్తర్వులు సదరు A.S.నెం. **243/2010**రు కేసు విచారణ పూర్తయ్యేంత వరకు ఇచ్చియున్నారు. సదరు ఉత్తర్వులలో కోర్టు వారు ప్రతివాదులైన 1) **చెరుకుముడి రామచంద్రయ్య,** 2) **చెరుకుముడి క్రిష్ణయ్య** అనువారలు కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి సదరు **కొల్లి లక్ష్మీశ్రీధర్‌రెడ్డి**కి యీ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పరాధీనములు చేసినారని అభిప్రాయము వ్యక్తపరుస్తూ కేసు పూర్తయ్యేంత వరకు పర్మినెంట్ ఇంజక్షన్ ఉత్తర్వులు జారీ చేసియున్నారు. సదరు విషయములను మరుగునపరచి సదరు **కొల్లి లక్ష్మీశ్రీధర్‌రెడ్డి** మరియు ఇతరులు యీ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులను పరాధీనములు చేయుటకు మరియు ఎటువంటి బ్యాంకు లావాదేవీలు, తనఖాలు, ఇతర లావాదేవీలు చెల్లనేరవు మరియు నా క్లయింటు తీసుకొనబోవు చట్టపరమైన అన్ని చర్యలకు బాధ్యులగుదురు.

ఆస్తి షెడ్యూలు

నెల్లూరు రి॥డి॥ యిలాకా, నెల్లూరు స॥రి॥లో చేరిన నెల్లూరు బిట్–1 ఏరియా పట్టా నెం.166రు, సర్వే నెం.655/2రు, CASలో య 0.89 సెంట్లు, పట్టా నెం.482రు, సర్వే నెం.637/2రు, CAS లోని య 4.88 సెంట్లులో య 0.50 సెంట్లు పట్టా నెం.620రు, సర్వే నెం.660రు, CASలో య 0.79 సెంట్లు మొత్తము య.2.18 సెంట్లు భూమి.

పెనుబాక గంగాధరరెడ్డి, బి.కామ్, బి.ఎల్.,
అడ్వకేటు, రమేష్‌రెడ్డి నగర్, నెల్లూరు. సెల్ 98493 49333



కీ॥శే॥ అవనిగడ్డ విజయలక్ష్మీదేవి

సంస్మృతి
(దశమ వర్ధంతి)
(తిథి :ఆషాఢ బహుళ ద్వాదశి)
తే 27-07-2011ది
"నీ నవ్వు, నీచుటూరోక్కుటు మరపురానిది"
: భర్త :
అవనిగడ్డ వేంకటకృష్ణమూర్తి
(విశ్రాంత) మేనేజర్ నె.జి సహకార కేంద్రబ్యాంకు
సెల్ : 97034 08230
: తల్లి :
కొండూరు ప్రసన్నలక్ష్మి
(W/o స్వర్గీయ కొండూరుచెంగయ్య)
కుమార్తెలు - అల్లుళ్లు
వెంకట కామాక్షి సుజాత
దువ్వూరి హనుమంతరావు
వెంకట కళ్యాణభారతి
డా॥పాలపర్తి శివరామకృష్ణప్రసాద్
మనుమలు - మనుమరాళ్లు
చి॥సాయిపవన్
చి॥ దత్తకౌశిక్
చి॥ సాయిగీతా అనఘ
మరియు కుటుంబసభ్యులు

• దర్గా హుండీ డబ్బులు రూ.40 లక్షలు మాయం?

జాయింట్ అకౌంట్‌లో నిల్ బ్యాలెన్స్!



మత సమైక్యతకు ప్రతీకగా నిలిచే నెల్లూరు చెరువు వద్ద గల బారాషహీద్ దర్గా ఎంతో ప్రసిద్ధి చెందింది. వందల ఏళ్ల చరిత్ర వున్న ఈ దర్గాలో మొహరం నెలలో జరిగే రొట్టెల పండుగకు లక్షల మంది భక్తులు దేశవిదేశాల నుంచి వస్తారు. తమ శక్తిని బట్టి తృణమో పణమో ఈ సందర్భంగా దర్గాలో ఏర్పాటుచేసే హుండీలో వేసి వెళ్తారు. పండుగ ముగిసిన తర్వాత ఈ డబ్బును లెక్కించి నెల్లూరు ఎమ్మార్వో పేరిట వున్న అకౌంట్‌లో జమచేసి పెడతారు. దర్గా అవసరాలకు వక్ఫ్‌బోర్డు అనుమతి పొంది ఈ డబ్బులు ఖర్చుపెట్టాలి. గత ఏడాది జరిగిన రొట్టెల పండుగ హుండీ కలెక్షన్, పాత మిగులు కలిపి 40 లక్షల రూపాయల వరకు వుండాల్సి ఉండగా ఈ మొత్తం జాయింట్ అకౌంట్‌లో లేకుండా మాయమైపోయింది. దీన్ని తీసి ఖర్చు పెట్టేందుకు వక్ఫ్‌బోర్డు అనుమతి అడిగిన అధికారే లేదు. ఈ మధ్య కాలంలో దర్గా దగ్గర ఓ సిమెంటు రోడ్డు పని, సమాధుల దగ్గర గ్రానైట్ పరిచే పని, దర్గాలో తూర్పు వైపు గోడకు మరమ్మత్తులు చేపట్టారు. వీటికి నిధులు తన ఎమ్మెల్యే కోటా నుంచి ఇస్తున్నట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ప్రకటించారు. పనులన్నీ ఎమ్మెల్యే కోటా నిధుల నుంచే చేపట్టి వుంటే దర్గా హుండీలోని 40 లక్షలు ఏమైనట్లు? దీనిపై కొందరు జెండావీధి యువకులు సమాచార హక్కు చట్టం క్రింద నెల్లూరు ఎమ్మార్వోకు దరఖాస్తు చేసినా సమాచారం ఇవ్వకుండా దానికి సమాధి కట్టేశారంటే ఈ నిధులు కూడా స్వాహా అయిపోయాయని భావించక తప్పదు. దేవుని సొమ్ము నిర్భయంగా, నిర్లజ్జగా ఊడ్చిపారేసిన వారిపై చర్యలు తీసుకొనే బాధ్యత జిల్లా అధికార యంత్రాంగానికి లేదా? కలెక్టర్ గారూ ప్రతిరోజు ఈ త్రోవలోనే వచ్చే మీరు ఒకసారి దర్గా వద్దకు వెళ్లి వ్యవహారాలు పరిశీలిస్తే నిధుల కుంభకోణంతో ఇక్కడ జరిగే దందా మీకు తెలిసి వస్తుంది.



కెసిఆర్ దిష్టిబొమ్మకు పాడె కడుతున్న విద్యార్థులు.

• రాజుకొంటున్న ఉద్యమం

• సమైక్యాంధ్ర సాధనకోసం ఒకటవుతున్నారు.

సమైక్యాంధ్ర ఉద్యమం రాజుకుంటుంది. ప్రత్యేక తెలంగాణ కావాలని తెలంగాణ రాష్ట్ర సమితి, ఆ ప్రాంత ఇతర ప్రజాప్రతినిధులు చేస్తున్న ఆందోళనలను నిరసిస్తూ నగరంలో గత కొన్ని రోజులుగా వివిధ పార్టీలు, విద్యార్థి సంఘాలు తమ నిరసనలు తెలియ జేస్తున్నాయి. రోజురోజుకు సమైక్యాంధ్ర నినాదం స్వరం పెరుగుతుంది. సమైక్యాంధ్ర ఐక్యకార్యాచరణ సమితి, ఎస్ఎఫ్‌యుఐ, చిరంజీవి యువత తదితర సంఘాలు తమ గళాన్ని విన్పిస్తున్నాయి. తెలంగాణ ప్రాంతీయులకు ధీటుగా వివిధ ఆందోళన కార్యక్రమాలను చేపడుతుండడం విశేషం. ఇటీవల రైలురోకో కార్యక్రమాలను చేపట్టిన సంఘాలు రోడ్డుపై వంటవార్పుచేస్తూ తమదైనశైలిలో సమైక్య నినాదాన్ని విన్పిస్తున్నాయి. టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేయడమేకాక, ఆయనతోపాటు పలువురు నాయకుల ఫోటోలను రాక్షసులుగా చిత్రీకరిస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అటు కళాకారులు, ముస్లిం మైనార్టీలు, ప్రతిపక్ష, స్వపక్ష పార్టీలు తమ వంతు బాధ్యతగా సమైక్యాంధ్రను కాంక్షిస్తూ వివిధ కార్యక్రమాలు చేపడుతుండడంతో నగరంలో ఎక్కడ చూసినా ఈ నినాదమే దద్దరిల్లుతోంది.

[illegible]

• యధా ఎమ్మెల్యే తధా పిఏలు!

యధా రాజా తధా ప్రజా అన్నది పాత మాట. యధా ఎమ్మెల్యే తధా పిఏ అన్నది నేటి మాట. ఈ మాటను అక్షరాలా పాటిస్తున్నారు రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి పిఏలు. వీరిలో మహామ్ముదురైన ఒక పిఏ ఎమ్మెల్యే పేరు చెప్పి అధికారులను, కాంట్రాక్టర్లను దబాయించి వసూళ్లు చేయడంలో కలెక్షన్ 'కింగ్'గా పేరుగడించాడు. ఇక మరో పిఏ మూడో కృష్ణుడు మాదిరి. ఇతని బెదిరింపులకు అంతే లేదు. చూడ్డానికి ఎర్రగా బుర్రగా సాధుజీవిలాగా కన్పించినా అదేదో సినిమాలో విలన్ పుండరీకాక్షయ్య చెప్పినట్లు తినేది వెజిటేరియన్, చేసేది నాన్ వెజిటేరియన్ పనులన్న చందంగా వుంటుంది ఈ పిఏ వ్యవహారశైలి. వీరు ఎవరికి తోచినట్లు వారు తమకు దొరికిన అవకాశాన్నల్లా వదలకుండా డబ్బులు వసూలు చేస్తున్నారట. గతంలోనూ గృహ నిర్మాణ శాఖలో జరిగిన కుంభకోణంలో ఈ ముదురు పిఏ పాత్ర వుండడంతో కాళ్లు గడ్డాలు పట్టుకొని తన పేరు బయటకు రాకుండా బయటపడ్డాడు. తన బాసే అందరి దగ్గర వసూళ్లకు పాల్పడుతుంటే తాము తింటే తప్పే మనుకున్నాడో ఏమో వైద్య ఆరోగ్య శాఖ అధికారులను, మునిసిపల్, రవాణా శాఖ, విద్యాశాఖ, పోలీస్ ఇలా ఒకటి మిటి అన్ని శాఖల అధికారులకు ఫోన్ చేసి బెదిరించి పనులు చేయించుకొంటుంటాడట. ఎక్కడ కాదంటే ఎమ్మెల్యేకు తమపై చాడీలు చెప్తారోనని భయపడి అడిగిన పనులు, కావలసిన సొమ్ము ముట్టజెప్తున్నారట. ఇక మున్సిపాల్టీలో కొందరు అధికారులను అడ్డం పెట్టుకొని కాంట్రాక్టర్ల వద్ద మామూళ్లు వసూలు చేస్తుంటారు. ఒక పిఏ అయితే సైలెంట్‌గా పనులు చక్కబెట్టడం, అందినకాడికి దోచుకోవడంలో దిట్ట. కరెంటు ఆఫీసులో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేసే అతను వసూళ్లు చేయడంలో ప్రవీణుడు. మాట వినకపోతే ఆయా నేతలు, అధికారులపై ఎమ్మెల్యేకి చాడీలు చెప్పడం, ఆయన బిజీగా వున్నారని బయటే నిలబెట్టడంతో చేసేదిలేక అడిగినంత ముట్టజెప్పాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

తరచూ బంద్‌లు

ఇబ్బందిపడుతున్న విద్యార్థులు

జిల్లాలో ఇటీవల అధికంగా బంద్‌లు చేస్తుండడంతో ఆ ప్రభావం విద్యార్థులపై తీవ్రంగా పడుతోంది. రకరకాల కారణాలతో విద్యార్థి సంఘాల మధ్య వున్న పోటీతత్వం, ఆధిపత్య పోరుతో ఒకరిని చూసి మరొకరు, ఒక సంఘాన్ని చూసి మరో సంఘం పోటాపోటీగా విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తుండడంతో పాఠశాలలు, కళాశాలలు తెరచి రెండు నెలలు గడవక ముందే ఎడాపెడా బంద్‌ల పేరుతో విద్యాసంస్థలు మూతపడడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేలాది రూపాయలు ఫీజుల రూపంలో చెల్లించి చదువుకొనేందుకు వెళ్లే విద్యార్థుల తల్లితండ్రులపైనా ఆ ప్రభావం వుంటోంది. తల్లితండ్రులు ఇద్దరు ఉద్యోగస్తులుగా వున్నవారు, వివిధ ప్రాంతాలలో ఉద్యోగాలను చేసుకొనేవారు పిల్లలను పాఠశాలలకు పంపి విధులకు హాజరౌతుంటారు. సాయంత్రం ఇంటికి తీసుకొని పోతుంటారు. అలాంటిది వున్నట్లుండి విద్యా సంస్థలను బంద్‌ల పేరుతో మూసి వేయిస్తుండడంతో పాఠశాలల యాజమాన్యాలు ఎప్పుడు ఇంటికి పంపుతాయో తెలియక, పిల్లలను ఇంటికి తీసుకొనిపోయే వీలులేక ఉద్యోగస్తులైన తల్లితండ్రులు పడుతున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. కొన్ని పాఠశాలలు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అరపూట తరగతులు నిర్వహించి విద్యాసంస్థలు మూసేస్తుండడంతో మరింత ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ప్రజావ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు అవలంభిస్తున్నప్పుడు బంద్‌లు, ఆందోళనలు చేపట్టడం తప్పుకాదు. ఎవరైనా వీటిని నిర్వహించవచ్చు. అయితే విద్యార్థి సంఘాల మధ్య నెలకొన్న పోటీతత్వం కారణంగా వాళ్లు చేశారని వీళ్లు, వీళ్లు చేశారని వాళ్లు బంద్‌లు చేపడుతుండడంతో విద్యార్థుల చదువులకు తీవ్ర విఘాతం ఏర్పడుతుంది.

జిడిల దండుడే దండుడు!

అదుపు చేయాలి ఎస్పీ గారూ...

క్రొత్త ఎస్పీ రమణకుమార్ పోలీసు సిబ్బందిని సక్రమ మార్గంలో పెట్టేందుకు ఎన్ని చర్యలు చేపడుతున్నా ఇంకా వారిలో మార్పు రావడంలేదనేందుకు జిడి వ్యవస్థ ఉదాహరణ. సమాజంలో అసాంఘిక శక్తుల కార్యకలాపాలను, కదలికలను గుర్తించేందుకు వీరు యూనిఫాం వేసుకోకుండా సాధారణ దుస్తుల్లోనే విధులు నిర్వహిస్తారు. రాను రాను జిడిలు ఆయా స్టేషన్ల ఎస్ఐలకు నెలనెలా వసూళ్లు చేసి ఇచ్చేందుకు, పేకాట, మద్యం వ్యాపారులు, దాబా నిర్వాహకుల నుంచి నెల మామూళ్లు సేకరించేందుకు పరిమితమౌతున్నారు తప్ప విధులు నిర్వహించడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నగరంలో వివిధ స్టేషన్లలో పనిచేసే జిడిలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతుంది. వన్‌టౌన్‌లో లక్ష్మీనరసయ్య, హరి అనేవారు జిడిలుగా వున్నారు. వీరిలో నరసయ్యది లాంగ్ స్టాండింగ్. కొద్ది రోజులు వేరే చోట చేసి తిరిగి పాత స్థానానికి చేరుకొన్నాడు. టు టౌన్‌లో శ్రీను, వేణులది హవా. సెటిల్‌మెంట్లలో వీరి పాత్ర ప్రధానం. త్రిటౌన్‌లో భాస్కర్, రామకృష్ణలు జిడిలు. వీరు లాడ్జీలు, ఇతరత్రా నెల మామూళ్లు వసూలు చేయడంలో దిట్టలు. ఫోర్త్‌టౌన్‌లో శరత్, ఫిఫ్త్‌టౌన్‌లో సాగర్, ప్రభాకర్‌లది ఇదే తీరు. సాగర్, ప్రభాకర్‌లు గతంలో త్రిటౌన్‌లో వుండి ఆ ఎస్ఐతోపాటు ఫిఫ్త్‌టౌన్‌కు బదలీ అయ్యారు. బాలాజీనగర్ స్టేషన్‌లో ప్రసాద్, రూరల్ స్టేషన్‌లో మరో జిడి వీరంతా కలెక్షన్ వసూలు చేసి ఎస్ఐలను సంతృప్తి పరచడంతోపాటు తమ జేబులు నింపుకోవడంలో చూపే శ్రద్ధ విధి నిర్వహణలో చూపక పోవడంతో దందాల వ్యవస్థగా జిడి వ్యవస్థ మారింది. రమణకుమార్ అయినా వీరిని గాడిలో పెట్టి పోలీస్ శాఖ పరువు కాపాడాలని పలువురు కోరుకొంటున్నారు.



డబ్బుకు లొంగే కుటుంబం కాదు

డబ్బులిస్తే ఆనం కుటుంబం ఎంతటికైనా తెగిస్తుందని జరుగుతున్న ప్రచారంపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఖండించారు. 16వ తేది నెల్లూరుకు విచ్చేసిన ఆయన రాజకీయ అంశాల గురించి మీడియాతో మాట్లాడారు. గత 80 సంవత్సరాలుగా రాజకీయాల్లో వున్న తాము ఎప్పుడు కూడా డబ్బులు తీసుకొని రాజకీయాలను భ్రష్టుపట్టించలేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మకూడదని కోరారు. రాష్ట్ర విభజన గురించి మాట్లాడుతూ సమైక్యాంధ్ర నినాదానికి తాము కట్టుబడినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి మంత్రి శైలజానాథ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వైఎస్ మరణంపై రెండేళ్ళ తర్వాత సందేహాలు వ్యక్తం చేయడాన్ని మంత్రి తప్పుపట్టారు.

క్రిస్టియన్ సంస్థల పేరిట కోట్లాది రూపాయల వసూళ్లు!

జిల్లా ప్రజలను మాయచేసి మభ్యపెట్టి 10వేల రూపాయలు చెల్లిస్తే ఆరు నెలల తర్వాత 60వేలు ఇస్తామని క్రిస్టియన్ సంస్థలు కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నాయి. ఒకరికి తెలియకుండా మరొకరు ఎగబడి డబ్బులు కట్టేస్తున్న ఈ పథకం చివరికి ఏమౌతుందన్నదానికి సమాధానం చెప్పేవారు లేరు.

పేద ప్రజల ఆర్థిక ఇబ్బందులను ఆసరా చేసుకొని కొన్ని సంస్థలు డబ్బు ఆశ చూపి తమవైపు తిప్పుకుంటున్నాయి. ముందుగా గ్రామీణ ప్రాంత ప్రజలను ఆకట్టుకొని, ఆతర్వాత పట్టణ ప్రజలకు వలవేస్తున్నాయి. వీటి వలలోపడిన ప్రజానీకం బయట అప్పులు చేసి మరీ చెల్లిస్తున్నారు. తొలుత 10వేలరూపాయలు చెల్లిస్తే 6 నెలల వ్యవధిలో 60వేల రూపాయలు చెల్లిస్తామని సంస్థ ప్రతినిధులు హామీ ఇస్తున్నారు. ప్రజలు చెల్లించే నగదుకు ఎటువంటి హామీ లేకపోయినప్పటికి కోట్ల రూపాయల్లో లావాదేవీలు సాగిపోతున్నాయి. గత సంవత్సరం నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారం జిల్లాలో నడుస్తోంది.

ఒక పేరు మీద తొలుత రూ. 10,500 తీసుకొంటారు. ఇందులో 500 సర్వీస్ ఛార్జీ క్రింద మినహాయించుకొంటారు. మరుసటి నెల నుంచి మూడు నెలల వరకు ప్రతినెల 2,800 రూపాయల వంతున సంస్థ ప్రతినిధులు చెల్లిస్తారు. నాల్గవ నెల నుంచి మరో అయిదు నెలల వరకు ప్రతి నెల ఆరువేలు వస్తుందని నమ్మబలుకుతున్నారు. ఇంతమొత్తం ఎక్కడ నుంచి తీసుకొచ్చి చెల్లిస్తారన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది. జిల్లా వ్యాప్తంగా సాగుతున్న ఈ వ్యవహారం ఎవరు నడిపిస్తున్నారో కూడా రహస్యంగా వుంచుతున్నారు. ప్రధాన కార్యాలయం చెన్నైలో వుందని ప్రచారం చేస్తున్నారు. మరోప్రక్క విదేశాల నుంచి భారీస్థాయిలో నిధులు వస్తున్నాయని పేద ప్రజలకు వీటిని అందజేస్తున్నామని రకరకాలుగా ప్రచారం చేస్తున్నారు.

దీని తెరవెనుక వున్న అసలు సూత్రధారులు బయటకు రాకుండా ఏజెంట్ల ద్వారా మొత్తం తతంగాన్ని నడిపిస్తున్నారు. ఒక కుటుంబంలో ఎంత మంది వుంటే అందరి చేత 10,500 రూపాయలు కట్టించుకుంటున్నారు. నెల్లూరు నగరంతోపాటు కావలి, గూడూరు డివిజన్లలో వందల కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి. ప్రజల నుంచి వసూలు చేస్తున్న నగదుకు సంబంధించి కొన్ని ప్రాంతాల్లో వివిధ ఛార్జీల పేరుతో రశీదులు ఇస్తుంటే మరికొన్ని ప్రాంతాల్లో ఎటువంటి రశీదులు ఇవ్వడం లేదు. క్రైస్తవ సంస్థల పేరుతో ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

10వేల రూపాయలకు 60వేల రూపాయలు వస్తుందని ఆశ చూపడంతో నానా అవస్థలుపడి చెల్లిస్తున్నారు. ఒకసారి చెల్లించి ఆదాయం పొందిన వారు మరింత ఆదాయం పొందేందుకు బయట ప్రాంతాల్లో వున్న బంధువుల పేరు మీద కూడా నగదు చెల్లిస్తున్నారు. ప్రజల నుంచి నగదు వసూలు చేసే ఏజెంట్లను అధిక మొత్తం ఎలా చెల్లిస్తారని ప్రశ్నిస్తే అది మీకు అవసరం లేదు. ముందుగా నగదు చెల్లిస్తే ఆ తర్వాత అధిక మొత్తం అందజేస్తామని చెబుతూ తప్పించుకొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా కోట్ల రూపాయలు వసూలు చేసుకొంటున్న ఏజెంట్ల మనుగడపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో అనేక సంస్థలు ప్రజలను మభ్యపెట్టి వివిధ పథకాల పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేసుకొని బోర్డు తిప్పేశాయి. ప్రస్తుతం క్రైస్తవసంస్థ పేరిట నగదు వసూలు చేస్తున్న వారు ఏ సంస్థకు చెందినవారో వెల్లడించడం లేదు. వీరు ఎక్కడుంటారో, ఏంచేస్తుంటారో కూడా ప్రజలకు చెప్పడం లేదు. గ్రామానికి వస్తే నగదు చెల్లించడం లేకుంటే ఏజెంట్లు నగదు ఇస్తే తీసుకోవడం తప్ప ఎవరు ఏమి అడగడం లేదు. ప్రజలు తమ ఇబ్బందులు, బలహీనతల కారణంగా నగదు చెల్లిస్తుంటే కొందరు వుద్యోగులు కూడా అధికమొత్తం వస్తుందని ఆశపడి లక్షలో కడుతున్నారు.

మూడు నెలల క్రితం ఈ నగదు వసూళ్లపై వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు అందింది. నగదు వసూలు చేసుకొన్న వ్యక్తి అనుకున్న సమయానికి తిరిగి చెల్లించకపోవడంతో బాధితులు ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు లక్షల్లో నగదు వసూలు, చెల్లింపులు జరుగుతున్నాయి. రిజర్వు బ్యాంకు అనుమతి, సంస్థలు రిజిస్ట్రేషన్ కలిగి వుండి నిబంధనల మేరకు ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. అయితే ఇక్కడ జరిగే లావాదేవీలకు ఎటువంటి అనుమతి లేదు.

ఈ వ్యవహారంపై ఇప్పటివరకు ఒక్కరు కూడా అభ్యంతరాలను వ్యక్తం చేయడం లేదు. పోలీసులకు సమాచారం వున్నప్పటికి ఫిర్యాదులు అందకపోవడంతో ఏమీ చేయలేకపోతున్నారు. భవిష్యత్‌లో క్రైస్తవ సంస్థ పేరిట వసూళ్లకు పాల్పడుతున్నవారు వందల కోట్ల రూపాయలతో వుడాయించక ముందే ప్రజలు మేల్కొంటే మంచిది. అత్యాశకుపోయి కుటుంబాలను నాశనం చేసుకొన్న సంఘటనలు అనేకం వున్నాయి. అధికారయంత్రాంగం కూడా ఈరకం ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించాల్సిన అవసరం వుంది.

● రాజుపాళెంలో

ఎన్ఆర్ఐల ఇంజనీరింగ్ కాలేజి



జిల్లాలో ఎన్నో ఇంజనీరింగ్ కాలేజిలున్నా ఎన్ఆర్ఐల పర్యవేక్షణలో నడిచే కాలేజి లేదు. ఆ లోటు తీర్చను నార్తురాజుపాళెంలో శ్రీ వెంకటేశ్వర కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ పెట్టారు డాక్టర్ పెనుబల్లి బాబునాయుడు. కాలేజిలోని ప్రాధాన్యతలను 20వతేది విలేకరుల సమావేశంలో వివరించారు. క్రమశిక్షణ, అత్యుత్తమ విద్యాబోధన, వుద్యోగ అవకాశాలే ప్రాధాన్యతలుగా ఈ కాలేజి పెట్టామన్నారు. విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా సివిల్, మెకానికల్, ఇఇఇ, ఇసిఇ, కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌లను మొదలు పెట్టినట్లు చెప్పారు. కాలేజిని సమర్థవంతంగా నిర్వహించడం కోసం పలు ఇంజనీరింగ్ కాలేజీలలో ప్రొఫెసర్, డీన్, ప్రిన్సిపాల్‌గా పని చేసి అనుభమున్న డాక్టర్ బి.దత్తాత్రేయశర్మను తీసుకోవడం జరిగిందన్నారు. ఫ్యాకల్టీగా డాక్టరేట్లను, విదేశాలలో పనిచేసే వారిని ఎంపిక చేశామన్నారు. కాలేజిలో అత్యాధునిక వసతులతో ల్యాబ్‌లు, లైబ్రరీలతోపాటు ఎసి క్లాస్‌రూమ్స్, హాస్టల్‌వసతి, బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు ప్లేస్‌మెంట్‌కు అవసరమై స్కిల్స్ మొదటి సంవత్సరం నుంచే నేర్పిస్తామన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం కోసం ట్యూషన్ ఫీజులో రాయితీ, లాప్‌ట్యాప్‌లు ఉచితంగా ఇస్తామన్నారు. మేనేజ్‌మెంట్ ఎన్ఆర్ఐలు కావడం వల్ల అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో అనుబంధం, వివిధ మల్టీనేషనల్ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ కోసం ప్రయత్నం చేస్తామని కాలేజి డైరక్టర్ రాయసం రాంబాబు చెప్పారు.





కసుమూరు దర్గాలో ప్రార్థన చేస్తున్న నెల్లూరు సిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి.



నెల్లూరు నగరంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదు సభలో మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. వేదికపై బాజ్జీ, అనిల్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు తదితరులు.

విత్తనాభివృద్ధికి కృషి

మండలాల్లో విత్తనాభివృద్ధికి సంబంధించి వ్యవసాయశాఖ తగిన చర్యలు చేపడుతోంది. వెంకటగిరి మండలంలో గ్రామ విత్తన పథకం అమలును పరిశీలించేందుకు జూలై మొదటివారంలో వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు నరసప్ప విచ్చేశారు. మండలంలోని వల్లివేడు గ్రామానికి వచ్చిన ఆయన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ పథకం తీరుపై రైతులకు పలు సూచనలు చేసిన ఆయన మాట్లాడుతూ వెంకటగిరి, దక్కిలి, బాలాయపల్లి మండలాలలోని 20 గ్రామాల్లో ఈ పథకాన్ని

వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు నరసప్ప

అమలు చేస్తున్నామన్నారు. టాప్–24రకం వేరుశనగ విత్తనాన్ని అభివృద్ధి చేసేందుకు రైతులను ఎంపిక చేసి అరెకరా విస్తీర్ణంలో దీనిని అమలు చేస్తున్నామన్నారు. అధికారులు తరచూ గ్రామాలను సందర్శించి పథకం అమలు తీరును పరిశీలిస్తారన్నారు. వరి నాటే యంత్రాలను 50శాతం రాయితీపై రైతులకు అందిస్తామని తెలిపారు. మండలంలోని వల్లివేడు, జంగాలపల్లి, చిన్నన్నపేట, చిన్నపరెడ్డిపల్లి, పెట్లూరు, ఉప్పరపల్లి, మొగళ్లగుంట, మన్నగుంట తదితర గ్రామాల్లో రైతులు ఈ పథకాన్ని ప్రారంభించారు.

భూముల భక్షకునిగా మారిన విఆర్వో

కంచే చేనుమేసిన చందంగా వుంది దగదర్తి మండలం వెలిపోడు విఆర్ఓ సుధాకర్ వ్యవహారం. గ్రామంలోని ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ఆయన అందినకాడికి దిగమింగాలనే కుట్రతో లక్షలరూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేస్తున్నాడు. కామినేనిపాళెంలో సర్వే నెంబర్ 118–4లో 15 ఎకరాలు ఆక్రమించి తన బంధువు పేరున పట్టాపొందాడు. లింగాలపాడు గ్రామంలో

వెలిపోడు స్పెషాలిటీ ఇది.

మరో బంధువుకు 240 అంకణాల భూమిపట్టా ఇప్పించాడు. రెవెన్యూ అధికారులను ప్రలోభపెట్టి గ్రామంలో లేనివాళ్లు, బంధువులను స్థానికులుగా చూసి సర్టిఫై చేయించుకొంటూ విలువైన భూములను స్వాహా చేస్తుండడం మండలంలో గగ్గోలు రేపుతోంది. ప్రస్తుతం విచారణ భయం పట్టుకొన్న విఆర్ఓ సెలవుపెట్టి వెళ్లడట. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ఈ భూములపై విచారణ జరిపిస్తే అక్రమాలు వెలుగుచూసే అవకాశం వుంది.

● కావలిలో ఆగని

చెరువుల దురాక్రమణ!

పట్టించుకోని అధికార గణం

కావలి నియోజకవర్గంలో చెరువుల దురాక్రమణ జిల్లాలోని మిగతా ప్రాంతాల కంటే అధికంగా వుంది. ఈ దురాక్రమణ ఫలితంగా చెరువులకు ప్రతి ఏడాది గండి పడుతున్నా సంబంధిత అధికారులు దురాక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో రోజురోజుకూ చెరువులు రూపురేఖలు కోల్పోతున్నాయి. కావలి పట్టణ పరిధిలో పాపిరెడ్డి, ముసునూరులో మందాటి చెరువు వున్నాయి. వీటితోపాటు కావలి పెద్దచెరువు లోతట్టు ప్రాంతాలను ఆక్రమించి నిర్మాణాలు జరుగుతున్నాయి. పాపిరెడ్డి చెరువు విస్తీర్ణం 132 ఎకరాలు, అందులో 45ఎకరాలు ఆక్రమణలకు గురైంది. మందాటి చెరువు 160 ఎకరాలకుగాను 40 ఎకరాలు దురాక్రమణల పాలైంది. రుద్రకోట చెరువులో 332కుగాను 80ఎకరాలు ఆక్రమించేశారు. చెన్నాయపాళెం చెరువు 640 ఎకరాల్లో 55 ఎకరాలు ఆక్రమణ చెర చిక్కింది. తుమ్మలపెంట చెరువు 1151 ఎకరాల్లో 120 ఎకరాలు ఆక్రమణలకు గురైంది. బోగోలు మండలంలోని బోగోలు చెరువుకు సంబంధించి 200 ఎకరాల్లో 20 ఎకరాలు ఆక్రమించారు. కోవూరుపల్లి చెరువు 210 ఎకరాల్లో 40ఎకరాలు, కడనూతల్లో 185కి గాను 26ఎకరాలు, జక్కేపల్లి గూడూరు చెరువు 210ఎకరాల్లో 45 ఎకరాలు, కండ్రిగ చెరువుకు 131 ఎకరాల్లో 40, పాత బిట్రగుంట చెరువులో 104 ఎకరాల్లో 35 ఎకరాలు దురాక్రమణలకు గురయ్యాయి. దగదర్తి మండలంలో రంగసముద్రం చెరువు 127 ఎకరాల్లో 28 ఎకరాలు, నారాయణపురంలో 78ఎకరాల్లో 35, మనుబోలుపాడులో 130 ఎకరాలకుగాను 30 ఎకరాలు, దుండిగంలో 87ఎకరాలకుగాను 27 ఎకరాలు దురాక్రమించేశారు.

వెంకటగిరిలో నూలు డిపో!

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న విధంగానే వెంకటగిరిలోనూ జాతీయ చేనేత అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నూలు డిపోను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర చేనేత, జౌళిశాఖ సహాయ మంత్రి పనబాకలక్ష్మి ప్రకటించారు. ఘంటసాల సేవాసంఘం వార్షికోత్సవాల్లో పాల్గొనేందుకు వెంకటగిరి వచ్చిన ఆమె ఆర్‌అండ్‌బి గెస్టుహౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. నేత కార్మికులకు వర్క్‌షెడ్లు మంజూరు చేస్తున్నామని, బంగారుపేటకు చేనేత క్లస్టర్ మంజూరైందని తెలిపారు. నేత కార్మికులను ఆదుకొనేందుకు తగినచర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నేత వర్గాల వారు చేనేత పరిశ్రమపై పడిన వ్యాట్ భారాన్ని తొలగించాలని మంత్రిని కోరారు. అలాగే వెంకటగిరిలో శబరి, శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు

పనబాక వెల్లడి

స్టాపింగ్ ఇవ్వాలని కోరగా దానికి సంబంధించిన ప్రతిపాదనలను ఎంపి చింతామోహన్ ద్వారా రైల్వే శాఖకు పంపితే తాను ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఘంటసాల సేవాసంఘం వేదుకల్లో పాల్గొని సంస్థ అధ్యక్ష కార్యదర్శులైన ప్రసాద్, మోహన్‌రావులను అభినందించారు. బాలసదనం అనాధ బాలికలకు దుస్తులను పంపిణీ చేశారు.

● తోటపల్లి గూడూరులో

చింతా రుసరుస

తిరుపతి పార్లమెంటు సభ్యుడు చింతామోహన్ వివిధ అంశాలపై సంధించిన ప్రశ్నలకు అధికారులు తెల్లమొఖం వేసిన వైనం తోటపల్లి గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో చోటు చేసుకొంది. ఇటీవల సమావేశానికి హాజరైన ఎంపి చింతా మోహన్ సాక్షరతా కేంద్రాల స్థితిగతులు, అక్షరాస్యత శాతం వివరాలు చెప్పమనేటప్పటికి సంబంధిత సిబ్బంది నీళ్లు నమలడంతో ఎంపి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఉపాధిహామీ పథకంపై ఇఓఆర్‌డి జయరామయ్య చెప్పిన దానిపై ఆగ్రహించిన ఆయన చేయదగ్గ పనులను చేయలేకపోతున్నారని, నిధులున్నా సక్రమంగా వినియోగించుకోలేక పోతున్నా

ఏ వివరాలూ తెలియవన్న అధికారులు

రన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరితీరుపై వివరాలు అడిగిన ఎంపి ఈ కేంద్రాలకు ఎంతో ప్రాధాన్యత వుందన్నారు. శిశు మరణాల రేటు తగ్గించడంలో అంగన్‌వాడీల పాత్ర ఎంతో వుందన్నారు. ఇందుకోసం 8వేల కోట్లు వ్యయం చేస్తున్న సంగతిని గుర్తు చేశారు. సాక్షరతా భారత్ ద్వారా మహిళలు, వృద్ధులలో విజ్ఞానం పెంపొందించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. మొత్తం మీద మండల అధికారుల తీరుపై చింతా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం వారి పని తీరుకు నిదర్శనం. ఈ సమీక్షా సమావేశంలో తహశీల్దార్ లీలారాణి, శ్రీనివాసరావు, కృష్ణవేణి, గౌస్‌మెహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తులకు పై ఎత్తులు!

కలువాయి మండలంలో ఎర్రచందనం అక్రమ రవాణా జోరుగా సాగుతున్న సంగతి తెలిసిందే. పోలీసులు, ఫారెస్టు అధికారులు స్మగ్లర్లతో చేతులు కలపడంతో యదేచ్ఛగా ఎర్రచందనం తరలిపోతోంది. స్మగ్లర్లకు ఆటంకాలు ఎదురైతే స్థానిక నాయకులు క్షణాల్లో వాలిపోతుండడంతో ఈ అక్రమ రవాణా అడ్డూఆపు లేకుండా సాగుతోంది. ఇటీవల చందనం దుంగలు దాచిపెట్టడంలో రకరకాల ఎత్తులు వేస్తున్నారు. చెరువులో పెద్ద ఎత్తున దుంగలను నిల్వ చేసి వుంచారు. చేపలు పట్టుకొనేందుకు వెళ్లిన వారికి ఈ ఎర్రచందనం దుంగలు కంటపడ్డాయట. వీటిని ఎవరికీ తెలియకుండా అమ్మి జాక్‌పాట్ కొట్టాలనుకొని స్థానికంగా

కలువాయి స్మగ్లర్లు ముదిరిపోయారు.

వుండే కొందరు నేతలను ఆశ్రయించారట. వారు రంగలోకి దిగి కొందరు ఫారెస్టు అధికారుల సహాయంతో చెన్నై స్మగ్లర్లతో బేరసారాలు సాగించారు. చెరువులో దుంగలను దాచిన స్మగ్లర్లకు ఈ విషయం బయటకు పొక్కడంతో వారు రాత్రికి రాత్రి అందులో నుంచి ఎర్రచందనాన్ని బయటకు తీసి తరలించేశారు. చేపలు పట్టేవారి సహకారంతో లక్షలు వెనుకేసుకోవాలనుకొన్న ఫారెస్టు అధికారి ఈ విషయం తెలుసుకొని అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. చెరువులో వున్న దుంగలను ఎవరు తీసుకొనిపోయారో చెప్పండంటూ అందరినీ చితకబాదాడట. జిల్లా అటవీశాఖాధికారి స్మగ్లర్లపై పెట్టే నిఘా సిబ్బందిపై పెడితే ఇంటిదొంగలు బయటపడతారు.



నెల్లూరులో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, జాయింట్ కలెక్టర్ సౌరబ్‌గౌర్, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు.

వెంకటగిరిలో మరో పోలీస్‌స్టేషన్ ఎప్పుడు?

80వేల జనాభాకు ఒకే స్టేషన్

వెంకటగిరికి పురపాలక హోదా వచ్చి ఆరేళ్లు గడుస్తున్నా పట్టణంలో రెండో పోలీస్‌స్టేషన్ ప్రతిపాదన అమలుకు నోచుకోవడం లేదు. 60వేల మంది జనాభా పట్టణంలో నివసిస్తుండగా, రూరల్ మండల పరిధిలో 20 పంచాయితీలు వున్నాయి. వీటన్నింటిలో శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు ఒకే స్టేషన్ వుంది. ట్రాఫిక్ సమస్య అధికం కావడం, దొంగతనాలు జోరందుకోవడంతో ప్రజలు హడలిపోతున్నారు. పోలీసులు ప్రజలకు ఎన్ని జాగ్రత్తలు చెప్పినా, అవగాహన సదస్సులు నిర్వహించినా దొంగతనాలు మాత్రం జరుగుతూనే వున్నాయి. గ్రామాలలోనూ ఇదే పరిస్థితి. దొంగతనాలను అరికట్టడంలో పోలీసు వైఫల్యం స్పష్టంగా కన్పిస్తోంది. గస్తీ తిరిగేందుకు తగినంత సిబ్బంది లేకపోవడం పోలీసులకు సమస్యగా మారింది. ఈ సమస్యలన్నింటిని అధిగమించి ప్రజలకు తగిన రక్షణ కల్పించాలంటే పోలీస్‌స్టేషన్ పట్టణానికి, గ్రామానికి వేరువేరుగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. అధికారులు, పాలకులు రెండో పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై తగిన కృషి చేయాలని పట్టణ ప్రజలతోపాటు గ్రామాలలోని వారు కోరుకొంటున్నారు.

ముత్తుకూరు వెటర్నరీ డాక్టర్‌పై విచారణ


2007 సంవత్సరం నాటి గణాంకాల ప్రకారం జిల్లావ్యాప్తంగా 85వేల వీధికుక్కలున్నాయని జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు భాస్కర్ తెలిపారు. ఈ నాలుగు సంవత్సరాల్లో కొంతవరకు పెరిగి వుంటాయన్నారు. ముత్తుకూరు వెటర్నరీ డాక్టర్ ఇందిరారెడ్డిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టేందుకు ఆయన వచ్చాడు. ఈ సందర్భంగా రైతులు పశువైద్యురాలిపై ఫిర్యాదులు చేశారు. ఒక నాయకుడు చెప్పినట్లు వింటూ అతనికి, ఆయన అనుచరులకు ప్రాధాన్యమిస్తూ పశువులమేత, పశుగ్రాస పంపిణీ, ఇతర టీకాల విషయంలో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని జెడికి ఫిర్యాదు చేశారు. మండలానికి వచ్చిన ఆయన తోటపల్లిగూడూరు మండలంలోని వైద్యుల పనితీరును కూడా పరిశీలిస్తే బాగుంటుందని ఆయా మండల ప్రజలు కోరుకుంటున్నారు. పశువైద్యాధికారులను గాడిలో పెట్టకపోతే రైతులు వైద్యశాలలకు తాళాలు వేసే పరిస్థితి నెలకొంటున్నది.

మాజీ ఎమ్మార్వోపై పోలీసు కేసు!


ఫోర్జరీ సంతకాలతో రికార్డులను తారుమారు చేశారన్న అభియోగంపై గతంలో వెంకటగిరి తహశీల్దార్‌గా పని చేసిన స్వామినాధన్‌పై పోలీసు కేసు నమోదైంది. వెంకటగిరి పట్టణ పరిధిలో పెరియవరం వద్ద సర్వేనెంబర్ 161/3లోని భూవివాదానికి సంబంధించి ఫోర్జరీ సంతకాలతో రికార్డులను సృష్టించినట్లు వచ్చిన ఆరోపణలపై వాటిని హైదరాబాద్‌లోగల ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. అక్కడ వాటిని పరిశీలించిన అధికారులు అవి నకిలీ రికార్డులని తేల్చిచెప్పడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం స్వామినాధన్ పదవీ విరమణ చేసి వుండడం విశేషం. రిటైర్డ్ తహశీల్దార్‌పై భూములకు సంబంధించి ఫోర్జరీ కేసు నమోదు కావడం సంచలనం రేపింది.

వైద్య సిబ్బంది పనితీరు మారాలి!

కావలి ఎమ్మెల్యే మస్తాన్‌రావు ఆకాంక్ష



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యుల పనితీరు మెరుగు పరచుకోవాలని, రోగులకు వైద్యసేవలు అందించడంలో తగిన శ్రద్ధ వహించాలని కావలి శాసన సభ్యుడు బీద మస్తాన్‌రావు సూచించారు. కావలి ఆస్పత్రిని సందర్శించిన ఆయన అక్కడి రోగులకు అందుతున్న వైద్యసేవ లను పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణం అపరిశుభ్రంగా వుండడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన ఆస్పత్రి కమిటీ చైర్మన్‌గా ఎలాంటి సహాయసహకారాలు అందించడానికి, నిధులు తీసుకవచ్చేందుకు, అభివృద్ధి పరచేందుకు కృషి చేస్తా నని చెప్పారు. షాషింగ్ కాంప్లెక్స్ అద్దె బకాయిలు చెల్లించని వారికి నోటీసులు జారీచేసి కఠిన చర్యలు చేపట్టాలని సూప రింటెండెంట్ డాక్టర్ సుబ్బారావును ఆదేశించారు. ఆపరేషన్ థియేటర్, ఎమర్జెన్సీ వార్డుల్లో సౌకర్యాలు మెరుగు పరచేందుకు, శవాలను భద్రపరచే బాక్స్ మరమ్మత్తులకు, జనరేటర్ అందుబాటులో వుంచుకొనేందుకు కావలసిన డీజిల్ సప్లయ్, అదనపు గదులు నిర్మించేందుకు సమావేశంలో తీర్మానించారు. మరుగు దొడ్లకు సింథటిక్ ట్యాంకు ఏర్పాటుకు, డెంటల్ డాక్టర్‌ను కాంట్రాక్టు పద్ధతిన నియమించుకొనేందుకు, ఫర్నిచర్ కొనుగోలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మొత్తం మీద బీద మస్తాన్‌రావు ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో మెరుగైన సదుపాయాలు సమకూరనున్నాయి.




హుస్సేన్ శివతత్వం...



ఇదేం పొరపాటుగా వ్రాసిన శీర్షిక కాదు. పదహారణాల వాస్తవం. మామూలుగా సన్యాసులు, స్వాములు, బాబాలు, పీర్, మురీద్, ఫాదరీలు ఆధ్యాత్మిక బోధనలు చేస్తుంటారు. వీరిని మించి శివతత్వం బోధన చేస్తూ ట్రంకు రోడ్డులో చర్చనీయాంశమయ్యారు... ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ హుస్సేన్ రెడ్డి. బ్రహ్మకుమారీల తత్వాన్ని అవపోసన పట్టిన ఈ అధికారి తనతో పనిబడి పోయిన వారితో అంతా మిథ్య.... శివాజ్ఞలేనిదే చీమైనా కుట్టదు. శివనామ జపంతో పునీతం కమ్మని చెప్పడం విని ఆశ్చర్య పోతున్నారు. ఇంత చెప్పే హుస్సేన్‌రెడ్డి పైసలు లేనిదే పనిచేయడం లేదని కార్యాలయానికి వెళ్లిన వారు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇదేమిటి హుస్సేన్ సాబ్... కాదు హుస్సేన్ రెడ్డి గారు!

మోకాలడ్డుతున్నారు




సీనియర్ పార్లమెంటు సభ్యుడు చింతా మోహన్ ఈ మధ్య జిల్లాలోని తన నియోజకవర్గ పరిధిలోనికి వచ్చే మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గెలిచిన తర్వాత కనపడడనే ప్రచారానికి విరుద్ధంగా ప్రజల్లో వున్న చింతా మోహన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. జిల్లా అభివృద్ధికి పాటుపడాలని ఎంతో ప్రయత్నం చేస్తున్నా... కానీ కొందరు పెద్ద మనుషులు మోకాలడ్డుతున్నారు. నెల్లూరులో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని తపిస్తున్న నాకు స్థల సేకరణకు సహకరించేవారు లేరు. ఇత రత్రా అభివృద్ధి పనులకు అడ్డంకిగా నిలుస్తున్నారు. ఇది నన్నెంతో నిరుత్సాహానికి గురి చేస్తుందన్నారు. చింతాకు ఇంత చింత మిగులుస్తున్న వారెవరో బహిరంగంగా చెప్పేస్తే బాగుంటుందని ట్రంకు రోడ్డులో టాక్.

ట్రంకురోడ్డులో ఆంక్షలు




ఏదో ఒక సమయంలో ట్రంకు రోడ్డుకు వెళ్లనిదే నెల్లూరీయులకు పూట గడచినట్లుండదు. అటువంటి ట్రంకు రోడ్డులోని గాంధీబొమ్మసెంటర్‌లో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను పక్షం రోజుల్లో పూర్తి చేస్తామని జంట ఎమ్మెల్యేలు రోడ్డుపై కుడివైపు ట్రాఫిక్ నడతను ఆపారు. పనులు మొదలై మూడు వారాలయ్యింది. న్యూటూకీస్, స్వతంత్ర పార్కు వీధుల్లో నుంచి రాకపోకలు సాగించే వారు, ఆత్మకూరు బస్టాండ్ నుంచి విఆర్‌సి సెంటర్ వైపు వెళ్లేవారు నానా పాట్లు పడుతున్నారు. ఒకవైపు ఎత్తు పెంచేసి వేస్తున్న రోడ్డు వల్ల చిన్నపాటి వర్షానికే నీళ్లు ఎక్కడ నిలబడతాయోనని జనం ఆలోచన చేస్తుంటే అధికారులు ఇవేమీ పట్టవంటూ తమ పనిలో తామున్నారు.

నాకేం లేదు...



నోటికొచ్చినట్లు అబద్ధాలు చెప్పడంలో ఘనాపాఠి రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి. కూరగాయల మార్కెట్ ప్రక్కనున్న కోనేరు సందర్శనకు వెళ్లిన ఆయన మైకు చేత పుచ్చుకొని నాకేం ఆస్తులు లేవు. మా నాయన కాపువీధిలో ఇచ్చిన ఇంటికి నేను నా సోదరులు కూడా వారసులు. దాంట్లో నా భాగం రవ్వంత. చింతా రెడ్డిపాళెంలో నాన్న ఇచ్చిన 24 ఎకరాల భూమిని నా ఇద్దరు కొడుకులకు చెరి 12 ఎకరాలు పంచేశా. ప్రజాసేవలో తరిస్తూ శేష జీవితాన్ని గడిపేస్తానని చెప్పడం విని చెవుల్లో కూరగాయలు పెట్టుకోవడం మార్కెట్‌లోని వ్యాపారస్తుల వంతయ్యింది.

ధైవం... సైన్సు!



రెండు అంశాలు ఒక వరలో ఇమడవు. సైన్సు దైవ సృష్టి కాదు వాస్తవ దృష్టితో చూడమంటుంది. హేతువాదులైతే శాస్త్రీయ బద్ధత అంటూ నొక్కివక్కాణిస్తుంటారు. కానీ ఈ విషయాలను ఇస్రో ఛైర్మన్ డాక్టర్ రాధాకృష్ణన్ పట్టించుకోరు. శ్రీహరికోటలో 15వ తేది పిఎస్‌ఎల్‌వి – 17 రాకెట్ ప్రయోగాన్ని పురస్కరించుకొని 10వ తేది శ్రీకాళహస్తిలో ముక్కంటికి, సూళ్లూరుపేట గ్రామదేవత చెంగాళమ్మ సన్నిధికి సతీ సమేతంగా వెళ్లి పూజించి వచ్చారు. ఇస్రోలోని కొందరు శాస్త్రవేత్తలు సృష్టి రహస్యాలు ఛేదిస్తూ కూడా తమ ఛైర్మన్‌కు ఇదేం భక్తని లోలోన సణగడమే కాని బహిరంగంగా మాత్రం ఏమీ మాట్లాడరు.


చుట్టుమాటు మాటలు

అమ్మకానికి తెలుగు ఛానళ్లు



తెలుగు టీవీ ఛానెళ్లకు గడ్డుకాలం దాపురించిందా? పరిస్థితుల్ని బట్టి చూస్తే ఇది నిజమే అనిపిస్తోంది. ఇతర భాషలతో పోలిస్తే తెలుగులో ఛానెళ్ల సంఖ్య కాస్తంత ఎక్కువే. ఇందులో ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెళ్ల కంటే న్యూస్ ఛానెళ్లు ఎక్కువగా వుండటంతో సమస్య వచ్చి పడింది. రాజకీయ పార్టీలు కూడా తమ 'రాజకీయ' ప్రచారానికి ప్రత్యేక ఛానెళ్లనే ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో న్యూస్ ఛానెళ్ల ప్రేక్షకులు పార్టీల వారీగా విడిపోయారని ఓ సర్వేలో వెల్లడైంది. సంచలనాలకు దూరంగా వుంటూ కేవలం తటస్థ వార్తలకే పరిమితమైన ఈటీవీ2 లాంటి ఛానెళ్ల పరిస్థితి మరీ దయనీయంగా తయారైంది. దీంతో ఛానెళ్ల మనుగడ కష్టంగా వుందంటూ వాటి యాజమానులు రోజులు లెక్కిస్తున్నారు. మంచి బేరం వస్తే ఛానెళ్లను అమ్మడానికి ముందుకొస్తున్నారు. ఇప్పటికే 'సాక్షి' టీవీలో సగానికిపైగా వాటాల్ని అమ్మేశారు. ఇప్పుడు రామోజీరావు వంతు వచ్చింది. ఈటీవీ2ను వుంచుకొని మిగతా ప్రాంతీయ ఛానెళ్లను ఆయన అమ్మకానికి పెట్టాడు. హిందీ సోనీటీవి పెద్ద మొత్తాన్ని ఆఫర్ చేసి ఈ ఛానెళ్లను కొనుగోలు చేస్తోంది. దీంతో మిగతా ఛానెళ్ల వారు కూడా మంచి బేరాలు కోసం ఎదురుచూస్తున్నారు. సో... టీ.వీ ఛానెళ్లను కొనేవారికి మంచి అవకాశమన్న మాట!

కిరణ్‌కు 'సమయం' చాలడం లేదట



రోజుకు ఇరవైనాలుగు గంటలున్నా సిఎం కిరణ్‌కు సరిపోవడం లేదట. మరిన్ని గంటలుంటే బాగుండు అనుకుంటున్నాడు. కిరణ్ సిఎం అయినప్పటి నుంచి సమస్యలతోనే కాలం సరిపోతోంది. పరిపాలనపై దృష్టి పెట్టడానికి 'టైం' దొరకడం లేదట. ఎమ్మెల్యేలు, మంత్రుల రాజీనామాలు.. తెలంగాణ అల్లర్లు... బంద్‌లు... రాస్తా, రైలురోకోలతో కిరణ్ యమ బిజీగా వుంటున్నాడు. తెలంగాణ మంత్రుల రాజీనామాల వల్ల వారు నిర్వహిస్తున్న 'కీలక'శాఖల బాధ్యత కూడా ఇప్పుడు కిరణ్‌పై పడింది. దీంతో కిరణ్‌కు ఊపిరి సలపకుండా వుంది. పరిపాలన స్తంభించడంతో సచివాలయం బోసిపోతుంది. అధికారులకు ఆటవిడుపుగా వుంది. వచ్చే నెల నుంచి రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు సమ్మెకు దిగనున్న నేపథ్యంలో ఏం చేయాలో అర్థంగాక కిరణ్ తలపట్టుకుంటున్నాడు. గతంలో ముఖ్యమంత్రులకు రాజకీయ సలహాదారులుండేవారు. కిరణ్‌కు మాత్రం సలహాదారులెవరూ లేరు. ఏ నిర్ణయం తీసుకోవాలన్నా కూడా స్వతంత్రించి తీసుకోవాల్సిన పరిస్థితి. రాజకీయ అనుభవం, పరిపాలనపై పట్టు లేకపోవడంతో కిరణ్ సొంత నిర్ణయాలు తీసుకోలేకపోతున్నాడన్న విమర్శ వుంది. పాపం కిరణ్... సిఎం అయినా సుఖం లేకుండా పోయిందని మంత్రులు కొందరు సానుభూతి చూపిస్తున్నారు.

ఈ 'సిఎం' పేషీ మాకొద్దు



సిఎం పేషీలో పనిచేయడం ఓ వరంగా భావిస్తారు ఐఎఎస్ అధికారులు. అక్కడ వుంటే రాజ్యాధికారం చలాయించవచ్చు. అందుకే పైరవీలు చేసుకొని మరీ సిఎం పేషీ కోసం ఎగబడుతుంటారు. అయితే సిఎం కిరణ్ పేషీకి మాత్రం ఆ డిమాండ్ లేకుండా పోయింది. కిరణ్ పేషీలో పని చేయడానికి ఐఎఎస్‌లు ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రత్యేక రాష్ట్రం గొడవలతో సిఎం పేషీ ఉద్యోగాన్ని తుమ్మితే ఊడిపోయే ముక్కుగా భావించడమే అందుకు కారణం. దీనికితోడు కిరణ్ వ్యవహారశైలి కూడా సరిగా లేదట. ఇప్పటికే పేషీలో ముఖ్యకార్యదర్శిగా పనిచేస్తున్న జె.సత్యనారాయణ సీటు ఖాళీ అవుతోంది. ఈ స్థానంలో రావడానికి ఐఎఎస్‌లు ససేమిరా అంటున్నారు. రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వం లేకుండా సిఎం పేషీలో పని చేయడం దండగ అంటూ చాలామంది ఐఎఎస్‌లు చేతులెత్తేస్తున్నారు. పాపం సిఎం కిరణ్ మాత్రం తన పేషీ కోసం ఐఎఎస్‌లను వెదుక్కునే కార్యక్రమంలో వున్నాడు.

కెసిఆర్ 'మౌనం' వెనుక వ్యూహం ఏమిటో!



ఒక ప్రక్క తెలంగాణ ఉద్యమం వేడెక్కుతుంటే టిఆర్ఎస్ నేత కెసిఆర్ మాత్రం మౌనంగా వుండటం ఎవరికీ అంతుబట్టడం లేదు. దీంతో రాజకీయ జెఎసి కోదండరామ్‌కు, కెసిఆర్‌కు మధ్యకూడా సంబంధాలు బెడిసికొడుతున్నట్లు గులాబీ వర్గాలు చెబుతున్నాయి. కెసిఆర్‌కు కేంద్రప్రభుత్వం నుంచి రహస్య సంకేతాలున్నట్లు తెలంగాణవాదులు అనుమానిస్తున్నారు. త్వరలో తెలంగాణ వస్తుంది. అధిష్టానం నుంచి నాకు సమాచారం ఉందంటూ కెసిఆర్ పలు సందర్భాల్లో చెప్పడాన్ని జెఎసి నాయకులు కాస్తంత సీరియస్‌గానే తీసుకుంటున్నారట. కెసిఆర్ మౌనం వెనుక వ్యూహం ఏమిటో చెప్పాలంటూ జెఎసి సమావేశాల్లో కొందరు డిమాండ్ చేసిన సందర్భాలున్నాయి. అయినా కెసిఆర్ మాత్రం నోరువిప్పడం లేదు. ఒక ప్రక్క కాంగ్రెస్ పెద్దలు తెలంగాణకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నా కెసిఆర్ మౌనం వీడకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.


స్వాగతం! సుస్వాగతం!!
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిలో భాగంగా సింహపురికే ప్రతిష్టాత్మకమైన భూగర్భ డ్రైనేజీ శంకుస్థాపన మరియు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టను విచ్చేస్తున్న ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గారికి స్వాగతం! సుస్వాగతం!! ఆర్థికశాఖామాత్యులు శ్రీ ఆనం రామనారాయణరెడ్డి గారికి మున్సిపల్‌శాఖామాత్యులు శ్రీ మానుగుంట మహీధర్‌రెడ్డి గారికి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రివర్యులు శ్రీ పితాని సత్యనారాయణ గారికి, నెల్లూరు పార్లమెంటుసభ్యులు శ్రీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి గారికి, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు శ్రీ ఆనం వివేకానందరెడ్డి గారికి నెల్లూరు నగర శాసనసభ్యులు శ్రీ ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి గారికి, నెల్లూరు జిల్లా శాసనమండలి సభ్యులు శ్రీ వాకాటి నారాయణరెడ్డి గారికి, నెల్లూరు జిల్లా కలెక్టర్ శ్రీ శ్రీధర్ గారికి మరియు ఈ కార్యక్రమాలకు విచ్చేస్తున్న ప్రజాప్రతినిధులకు మా హార్దిక స్వాగత సుమాంజలి
నగరపాలక సంస్థ నెల్లూరు.
బి. రామిరెడ్డి
స్పెషల్ ఆఫీసర్, నగరపాలక సంస్థ
డా॥ టి.ఎస్.ఆర్. ఆంజనేయులు
కమిషనర్



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

ఆరోగ్యవిషయంలో పెద్దగా చెప్పుకో తగ్గదేమీ లేదు. కష్టసుఖాలు సమానంగా చోటు చేసుకొంటాయి. ధనవ్యయం అధికమవుతుంది. సోదరులమూలంగా కూడా ఖర్చు అవవచ్చు. బంధుమిత్రుల సహాయ సహకారాలందుతాయి. వాహన గృహవిషయాల ద్వారా ఖర్చు సూచనలు. ఆంజనేయుని తప్పక కొలవాలి. శరీరానికి గాయాలు తగులకుండా చూసుకోవాలి. ప్రయాణాలు సత్ఫలితాలనిస్తాయి.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

ఊహించనిరీతిలో ధనవ్యయమవుతుంది. ఎంత పొదుపు చేయాలనుకున్నా వీలుకాదు. ఇష్టులైనవారికిగాను ఖర్చు అవవచ్చు. బంధుమిత్రుల సహాయసహకారాలందుతాయి. గృహనిర్మాణం లేదా వసతి గృహాన్ని అమ్మడం అనే పనులలో నిమగ్నమవుతారు. శరీరానికి గాయాలు తగలకుండా చూసుకోవాలి. పాదాలు రుగ్మాలవుతాయి. ఆర్థిక సమస్యలుంటాయి. రాజకీయులు జాగ్రత్తగా నడచుకోవాలి.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

ఆరోగ్యవిషయాలు చక్కగా ఉంటాయి. నిరుద్యోగులకు శుభకాలం. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వస్త్రాభరణాలు కొంటారు. ప్రయాణాలు సత్ఫలితాల నిస్తాయి. విదేశీప్రయాణావకాశాలు కూడా కానవస్తున్నాయి. గృహనిర్మాణ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. మిత్రులు సాయమందిస్తారు. కుటుంబంలో సమస్యలు తీరుతాయి. రాజకీయులకు మేలైన కాలం. కళాకారుల ప్రతిష్ఠ పెరుగుతుంది.




కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

సోదరులతో అభిప్రాయభేదావకాశాలు. పనులు నిదానంగా సాగవచ్చు. ఒకటికి రెండుసార్లు ఆలోచించి చేయడం మంచిది. వ్యాపారులు గడచిన వారంలో ఏర్పడ్డ నష్టాలను ఈ వారంలో పూడ్చుకోవీలౌతుంది. అప్పులు తీరుస్తారు. విద్యార్థులకు ఒక విధంగా చదువు సాగుతుంది. ఇంటిలో వివాహసంబంధ విషయాలు ప్రస్తావనకొస్తాయి. సోమరితనం వీడి పనులు నిర్వహించడంలో మనసు పోనివ్వాలి.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

చాలా మేలైన కాలం. వృత్తిరీత్యా ఉత్సాహం, శ్రమ, ధనాదాయం అధికమవుతుంది. కళత్ర సుఖం చక్కగా ఉంటుంది. సంతానమూలంగా సుఖశాంతులు కానవస్తాయి. ధనాదాయం బాగుంటుంది. స్పెక్యులేషన్ కూడా లాభిస్తుంది. రాజకీయులకు అత్యంతం అనుకూలమైన కాలం. వ్యాపార విస్తరణ చేస్తారు. విద్యార్థులకు మంచి కాలం. వృత్తిపరులకు కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

ఆర్థికవిషయాలు కొంత తృప్తికరంగా ఉంటాయి. ప్రతి అడుగు ఆచితూచి వేయడం మంచిది. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా ఉండడానికి ప్రయత్నించండి. ఆర్థికలావాదేవీలలో జాగ్రత్త. కఠినంగా మాట్లాడవద్దు. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా వుండాలి. పైవారిని విమర్శించకుండాలి. విద్యార్థులు చదువువిషయంలో శ్రద్ధ చూపాలి. కళాకారులు వృత్తిపరులు జాగ్రత్తగా మెలగాలి.

వారఫలాలు

తేది 23-7-2011 నుండి 29-7-2011 వరకు కర్కాటకంలో రవి; మిథున, కర్కాటకాల్లో శుక్రుడు; కర్కాటక, సింహాల్లో బుధుడు; మేషంలో గురువు; వృషభంలో కుజ, కేతువులు; వృశ్చికంలో రాహువు; కన్యలో శని; మేష, వృషభ, మిథునాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం


శుభ ముహూర్తాలు

23, 27 తేదీలలో సింహ లగ్నాన ఉ.8.00 నుండి 10.00గంటల వరకు సాధారణ శుభ ముహూర్తాలున్నాయి.

జూలై తిథులు
ఆషాఢ బహుళ

23	శని	అష్టమి	రా 01.17	గం.ల.వ
24	ఆది	నవమి	రా 10.54	గం.ల.వ
25	సోమ	దశమి	రా 12.17	గం.ల.వ
26	మంగళ	ఏకాదశి	రా 01.17	గం.ల.వ
27	బుధ	ద్వాదశి	రా 01.45	గం.ల.వ
28	గురు	త్రయోదశి	రా 01.44	గం.ల.వ
29	శుక్ర	చతుర్దశి	రా 01.11	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

కుటుంబసభ్యులతో సఖ్యత తగ్గుతుంది. సంబంధం లేని విషయాల జోలికి పోకుండడం మంచిది. ఆర్థికవిషయాలు కొంత తృప్తికరంగా ఉంటాయి. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా ఉండడానికి ప్రయత్నించండి. ఆర్థికలావాదేవీలలో జాగ్రత్త. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఉద్యోగులకు పై అధికారుల సాయం చక్కగా లభిస్తుంది. అనుకొన్నవి సాధిస్తారు.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

కళత్ర సంబంధం చక్కగా ఉంటుంది. ఉద్యోగంలో నూతన బాధ్యతలధికం. చిరకాలంగా ఎదురుచూస్తూ వచ్చిన శుభఫలితాలు అనుభూతిలోనికి వస్తాయి. శత్రువుల బాధ తొలగుతుంది. జాగ్రత్త. బంధువులకు మీ చేతనైన సహాయం చేస్తారు. వ్యాపారులు కొత్త సంబంధాలు ఏర్పరచుకొంటారు. రాజకీయులకు ప్రోత్సాహకరమైన కాలం. వృత్తిపరులకు, కళాకారులకు మంచి ఆదరణ.




ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

తలకు గాయాలు తగిలే అవకాశాలెక్కువ. జాగ్రత్త. ధనవిషయంలో కూడ కటకట ఉండవచ్చు. సోదరులతో అభిప్రాయభేదావకాశాలు. అధికారులతో జాగ్రత్త. ఒకటికి రెండుసార్లు ఆలోచించి చేయడం మంచిది. వ్యాపారులకు గడచిన వారంలో ఏర్పడ్డ నష్టాలను ఈ వారంలో పూడ్చుకో వీలవుతుంది. అప్పులు తీరుస్తారు. ఇంటిలో వివాహ సంబంధ విషయాలు ప్రస్తావనకు వస్తాయి.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

దైవకార్యాలలో ఎక్కువగా పాలు పంచుకోవాలి. వ్యాపారులకు లాభాలలో కొంత కోత ఏర్పడవచ్చు. నిదానంగా ఖాతాదారుల మనసెరిగి నడచుకోవడం మంచిది. భాగస్వాములతో గొడవలు రాకుండా చూసుకోవాలి. అధిక ఖర్చులు మనసును కుంగదీస్తాయి. బంధువుల రాక తృప్తినిస్తుంది. రాజకీయులు లేనిపోని గొడవల్లో చిక్కుకొంటారు. ఉద్యోగులకు శ్రమ అధికం. విద్యార్థులకు వృథా కాలక్షేపం.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

సంతాన వివాహంలో కొంత ముందుకు సాగే అవకాశాలున్నాయి. పూజాకార్యాలలో పాలుపంచుకోండి. ధనవిషయంలో తెలివిగా ప్రవర్తించాలి. ఆర్థిక విషయాలు అంతంతమాత్రమే. ఇరుగుపొరుగువారి సహాయం అందవచ్చు. వ్యాపారులు ఖాతాదారులతో జాగ్రత్తగా మెలగాలి. రాజకీయులకు కొంత వెసులుబాటు. దుర్గను,రాహువును కొలవాలి. ఎదురుచూసిన సత్ఫలితాలు దక్కడంలో ఆలస్యం.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

మానసిక వేదన, ఒత్తిడి కొంత తగ్గవచ్చు. స్పెక్యులేషన్ మంచిది కాదు. ఆర్థికవిషయాలు మెరుగుపడవచ్చు. నూతన వస్త్రాభరణాలకై వెచ్చిస్తారు. గృహాలంకరణ విషయాలలో ఆసక్తి చూపుతారు. ఖర్చుకు వెరవరు. విద్యార్థులకు ప్రయోజనవంతమైన కాలం. అన్ని రంగాలలో ముందంజ వేస్తారు. అయినా వృత్తిలో అలసట ఎక్కువ. వ్యాపారులు అధికంగా కష్టపడాలి. ఉద్యోగులకు పెద్దల తోడు ఉంటుంది.

శీతలయంత్ర ప్రతిష్ఠతో సమస్యలు సర్దుకొంటాయి!

ఎం.కేశవరావు గూడూరు

** నైరుతి గదిలో వంట చేస్తున్నాము. ఇంట్లో అనారోగ్యాలెక్కువ.*

నిరుతి(నైరుతి) రాక్షసస్థానం. అక్కడి 'మంట' వున్న సమస్యల్ని తీవ్రతరం చేస్తుంది. వంట గది దక్షిణఆగ్నేయం వీలుకాదంటున్నారు కాబట్టి వాయువ్యపు గదిలోకి మార్చండి. ఈలోగా 'శీతల యంత్రం' ప్రతిష్ఠించుకోండి.

ఎన్.ప్రభాకరశాస్త్రి గుంటూరు

** రోడ్డు మలుపులున్న చోట స్థలం కొనుగోలు చేయవచ్చా?*

వీధి చూపులైనా, పోట్లయినా మలుపులున్న స్థలాలపై 'కోణ' పరంగా ప్రభావం చూపిస్తాయి. కాబట్టి ఈ స్థలాలు నిర్మాణానికి పనికిరావు.

టి.రఘునందనరావు శ్రీశైలం

** దక్షిణ వీధి అపార్టుమెంటులో ప్లాట్లు తూర్పు, పశ్చిమాలుగా నిర్మించారు.*

దక్షిణంపై అపోహలు వుండటం బట్టి అలా నిర్మిస్తారు. అంత మాత్రాన అవి మంచి ఫలితా లనిస్తాయనుకోవడం భ్రమ. వీటికి 'దిష్టి' దోషా లెక్కువ.

ఎన్.రాధికారెడ్డి తిరుపతి

** దక్షిణ వీధి వున్నది. తూర్పు ఇల్లు కట్టుకోవచ్చునా?*

రాజవీధి వైపే గృహ నిర్మాణాలు చేసుకుంటే మంచి ఫలితాలనిస్తాయి. దక్షిణ వీధికి తూర్పు ఇల్లు వైరుధ్య ఫలితాలనిస్తుంది.

టి.వి.చంద్రశేఖర్ చెన్నై

** ఈశాన్య బ్లాకు గృహంలో నానా బాధలు పడ్డాను. వీధి పోట్ల ఇళ్లలో బతికి బయటపడ్డాను.*

బ్లాకులన్నీ కూడా సక్రమంగా ఉండకపోతే కోణవేధను కలిగిస్తాయి. వీధి చూపులూ, పోట్లూ, 'దిష్టి' దోషాల్ని ఇళ్లలో తిష్టవేయిస్తాయి. వాస్తు సిద్ధాంతి ఇలాంటి ఇళ్లకు ఎప్పుడూ వెంట వుండాలి.

కె.విష్ణువర్ధన్‌రావు తెనాలి

** సైన్సు చంద్ర మండలానికి వెళ్తున్న కాలంలో ఇంకా దేవుడి నమ్మకాలేమిటి?*

మనిషి జ్ఞానం చంద్ర మండలానికే పరిమితం. ఒక పాలపుంతలో భూమి, ఎనిమిది గ్రహాలు, ఒక సూర్యుడు వున్నాడు. ఇలాంటి పాల పుంతలు ఖగోళంలో పదివేల కోట్లకు పైగా వున్నాయి. మనిషి అంతదాకా వస్తే అప్పుడు దేవుడిని వదిలేద్దాం!

డాక్టర్ కేశవులునాయుడు హైదరాబాద్

** వాస్తు శాస్త్రాలలో మంత్ర, తంత్ర శాస్త్రాలున్నాయా? ఏ గ్రంథం చదవమంటారు.*

అలాంటి జోలి మీకు అనవసరం. అవి తిరగబడితే ఆవాహక వ్యక్తుల్నే 'బలి' తీసుకుంటాయి. అయితే చెడు పనులు చేయననే నమ్మకం మీకుంటే, నీలకంఠ సోమయాజి 'తంత్ర సంగ్రహం' గురు ముఖంగా నేర్చుకోండి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

డి.సోమయాజులు నెల్లూరు

** నాకు కొంత వాస్తు జ్ఞానము వున్నది. అట్లా గృహమును నిర్మించినాను.*

ఎవరి పని వారే చేయడం మంచిది. ఇంటిల్ల పాదీ ఆరోగ్యాలు సరిలేవని మీరే చెబుతున్నారు. ఇప్పుడు ఇల్లు సరిచేసుకోవాలంటే లక్షలు కావాలి. ఈలోగా 'శీతలయంత్ర' ప్రతిష్ఠ చేసుకోండి.

పంటరెడ్డి పరంధామిరెడ్డి బుచ్చి

** ఎనిమిది, తొమ్మిది సంఖ్యలు వస్తే యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. నేను గమనించాను.*

మొత్తం సంఖ్యల్ని కలిపితే మూడు అంగారకుడికి, ఏడు 'శని'కి, ఎనిమిది, తొమ్మిదులు రాహుకేతువులకు స్థావరం అవుతాయి.

టి.రాణి చెన్నై

** రాత్రి శబ్దాలు, ఇంట్లో అనారోగ్యాలు, అమ్మాయి మానసిక వైపరీత్యాలు 'నరఘోష' యంత్ర ప్రతిష్ఠ తర్వాత మాయమైపోయాయి.*

ఆత్మలు, ఆవాహకాలు 'మంత్రశక్తి' ముందు నిలవ్వు. కాకపోతే యంత్రాన్ని బయటకు పంపే కుయుక్తులన్నీ పన్నుతాయి. మీరు వాటి ప్రభావానికి లొంగలేదు కాబట్టి విజయం సాధించారు. భగవంతుడికి కృతజ్ఞతలు తెలియజేయండి.

డి.ఎన్.సుమతి బెంగుళూరు

** ఏవో నీడలు తిరుగుతుంటాయి. వంటింట్లో గిన్నెలు పడిపోతాయి.*

కేశవమిత్రుని 'గ్రహకేతు' గ్రంథంలో ప్రతీకారేచ్ఛ గల ఆత్మలు ఇలా తిరుగుతుంటాయని వుంది. ఆత్మహత్యలు జరిగిన ఇళ్లలో ఇలాగే వుంటుంది.

ఆరోగ్య కేంద్రాలకు అనారోగ్యం

24 గంటలు పని చేయాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు, సిబ్బంది వుండడం లేదు. నిధులు, మందుల కొరత లేకపోయినా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆశించిన ఫలితాలు సాధించలేకపోతున్నాయి.



పేరుకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు.

జిల్లాలోని ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24గంటలు పని చేయాలన్న ఆదేశాలు ఏమాత్రం అమలు కావడం లేదు. జిల్లావ్యాప్తంగా వైద్యఆరోగ్యశాఖ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను విలీనం చేసి క్లస్టర్ పిహెచ్‌సీలుగా ఏర్పాటు చేయడం జరిగింది. ఇది ఏర్పాటు చేసిన తర్వాత అధిక జనాభా గల పరిధిలో వుండే కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24గంటలు పనిచేసే విధంగానూ, మిగిలిన ఆరోగ్య కేంద్రాలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పనిచేసే విధంగా నిర్ణయించారు.

అయితే ఆశాఖ అధికారులు నిర్ణయించిన విధంగా ఏ ఒక్క ప్రాంతంలో కూడా ఆరోగ్య కేంద్రాలు 24గంటలు పనిచేయడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తెరచి వుండాల్సిన కేంద్రాలు సైతం మధ్యాహ్నానికే మూసివేయబడుతున్నాయి. దీంతో వైద్యం కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కప్రక్క ప్రజలకు అన్ని వైద్యసేవలు అందించేందుకు కోట్లరూపాయలు ఖర్చు చేస్తున్నా వైద్యసేవలు మెరుగుపడడం లేదు. మండలపరిధిలో వుండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రజలు వెళ్లాలంటేనే అక్కడ వైద్యులు వుంటారా? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు.

దూరప్రాంతం నుంచి వైద్యం కోసం వస్తే డాక్టరు లేరు వచ్చే దాకా వుండమని సిబ్బంది సలహా ఇస్తున్నారు. అత్యవసర సమయంలో ఆరోగ్య కేంద్రానికి వెళితే రోగి పరిస్థితి మరింత ప్రమాదంగా మారుతుందే తప్ప మెరుగుపడే పరిస్థితి వుండడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహించే డాక్టర్లు పట్టణ ప్రాంతాల్లో ప్రైవేట్ వైద్యశాలలు నిర్వహిస్తూ అక్కడే ఎక్కువ సమయం గడుపుతున్నారు. ప్రభుత్వం నుంచి ప్రతినెల వేలాది రూపాయలు వేతనం తీసుకొంటున్నా విధులకు సక్రమంగా హాజరుకావడం లేదు. విధులు నిర్వహించే మండలంలోనే నివాసం వుండాలన్న నిబంధన గురించి ఆశాఖ అధికారులు ఎప్పుడో మరచిపోయారు.

వైద్యులు మండల కేంద్రాల్లోనే నివాసం వుండాలని ప్రజలు కోరుకోకపోయినా సమయపాలన పాటించి రోగులకు వైద్యం అందించాలని కోరుకొంటున్నారు. ఇప్పటికే జిల్లాలో అతిసార, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు వ్యాపించి వున్నాయి. సీజనల్ వ్యాధుల విజృంభణ సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సమీక్షా సమావేశాలకే పరిమితమైపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిస్తే వ్యాధులు వ్యాపించకుండా నియంత్రణ చేయవచ్చు. ఇందుకు అవసరమైన నిధులు వున్నప్పటికి వాటిని గ్రామీణ ప్రాంతంలో పారిశుద్ధ్యం మెరుగుకోసం సక్రమంగా ఖర్చు చేయలేకపోతున్నారు. ఏదో ఒక పని చూపించి ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు చూపుతుంటారు.

అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో వుంచాలని ఇటీవల జిల్లా కలెక్టర్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆదేశించారు. కొన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో అందుబాటులో వున్నా వేసేందుకు డాక్టర్ వుండడం లేదు. మరికొన్ని పిహెచ్‌సీలలో స్టాకు లేదంటూ సిబ్బంది సమాధానం చెబుతున్నారు. నిధులు, మందుల కొరత లేకపోయినా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆశించిన ఫలితాలు సాధించలేకపోతున్నాయి. ఇప్పటికైనా ఆశాఖ అధికారులు సమీక్షలకే పరిమితం కాకుండా ఆరోగ్య కేంద్రాలను నిత్యం తనిఖీ చేసి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తే బాగుంటుంది.

స్మగ్లర్ల రాజ్యం

సరిహద్దులు దాటుతున్న ఎర్రచందనం!

ఇటీవల జిల్లా నుంచి ఎర్రచందనం సరిహద్దులు దాటి తరలిపోతోంది. జిల్లాలోని రాపూరు, వెంకటగిరి, ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాల్లో ఎర్రచందనం వృక్షాలు విస్తరించి వున్నాయి. అటవీప్రాంతం నుంచి ఎర్రచందనాన్ని చాలా సులభంగా తరలిస్తున్నారు స్మగ్లర్లు. ఎర్రచందనం దుంగలను అడవి నుంచి మైదాన ప్రాంతానికి తరలించేందుకు సమీప గ్రామాల ప్రజలను కూలీలుగా వినియోగిస్తున్నారు. సాధారణ కూలీ కంటే అదనంగా చెల్లిస్తుండడంతో కూలీలు ఆశ పడుతున్నారు. ఎర్రచందనాన్ని రహస్యంగా తరలించడం నేరమన్న విషయం గ్రామస్తులకు తెలియదు.

అటవీ ప్రాంతానికి సమీపంలో నున్న గ్రామాల ప్రజలు బయటి ప్రపంచంతో పెద్దగా సంబంధాలు కలిగి వుండరు. ఈ గ్రామాలకు వెళ్లేందుకు ఏ అధికారి కూడా ప్రయత్నించడు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ పథకం గురించి కూడా వీరికి తెలియదు. కేవలం అటవీ సంపద పైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. వీరి అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న స్మగ్లర్లు వివిధ రకాలుగా ఆశ చూపి తమ పని పూర్తి చేయించుకుంటున్నారు. అడవిలో వృక్షాలను నరకడం దగ్గర నుంచి మైదాన ప్రాంతానికి చేరవేసి వాహనాల్లో తరలించే వరకు కూలీల అవసరం వుంటుంది.

ఇందుకు వినియోగిస్తున్న కూలీలు కూడా స్మగ్లర్లకు నమ్మకస్తులుగా మెలగాల్సి వుంటుంది. ఏ రహదారిన వాహనాలు వెళితే అధికారుల దాడులు నుంచి తప్పించుకోవచ్చన్న సమాచారం వీరికి తెలిసినంతగా ఎవరికీ తెలియదు. అటవీశాఖ సిబ్బంది ప్రధాన రహదారులపైనే నిఘా వుంచుతున్నారు. దానిని పసిగట్టిన స్మగ్లర్లు కూలీల సహాయంతో అడ్డదారుల నుంచి ఎవరికీ అనుమానం రాకుండా ఖరీదైన వాహనాల్లో ఎర్రచందనాన్ని తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేసే స్మగ్లర్ల మధ్య విబేధాలు ఏర్పడిన సమయంలో మాత్రమే కొన్ని వాహనాలు పట్టుబడుతున్నాయి.

ఎర్రచందనానికి విదేశాల్లో మంచి గిరాకీ వుంటుంది. అంతేకాకుండా లక్షలాది రూపాయలు అనతికాలంలో ఆదాయం వస్తుండడంతో ఎన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నా, అక్రమ రవాణా చేయడం నేరమని తెలిసినా కూడా స్మగ్లర్లు దీనిని కొనసాగిస్తున్నారు. ఎర్రచందనం తరలించే సమయంలో అధికారులు ఎదురుపడి దాడులు చేస్తే ప్రతిఘటిస్తున్నారు. అవసరమైతే అటవీ సిబ్బంది ప్రాణాలు తీసేందుకు సైతం వెనుకంజ వేయడం లేదు. స్మగ్లర్ల నుంచి ప్రాణహాని ఏర్పడుతుండడంతో అధికారులతోపాటు సిబ్బంది కూడా దాడుల్లో పాల్గొనేందుకు ముందుకు రావడం లేదు.

స్మగ్లర్లను ఎదుర్కొనేందుకు అవసరమైన ఆయుధసామాగ్రి అటవీశాఖ అధికారుల వద్ద లేదు.

జిల్లాలోని రాపూరు, వెంకటగిరి, ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాల్లోని ఎర్రచందనాన్ని స్మగ్లర్లు తెలివైన ఎత్తుగడలతో జిల్లా సరిహద్దులు దాటిస్తున్నా అటవీశాఖాధికారులు చూసీ చూడనట్లున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖతోపాటు ఎక్సైజ్‌శాఖకు కూడా ఆయుధాలు సమకూర్చుతామని చేసిన ప్రకటన కేవలం కాగితాలకే పరిమితమై పోయింది. అటవీ ప్రాంతంలో విధులు నిర్వహించే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని జీవిస్తున్నారు. రాత్రి సమయంలో ఏ ప్రక్క నుంచి ఎవరు దాడులు చేస్తారోనని భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ, పోలీసుశాఖ మధ్య సమన్వయం వుండడం లేదు.

ఇదిలా వుండగా స్మగ్లర్ల నుంచి పట్టుకొన్న ఎర్రచందనం దుంగలను ఎక్కడ నిల్వ చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంవత్సరం జనవరి నుంచి ఇప్పటివరకు దాదాపు కోటి రూపాయలు విలువైన ఎర్రచందనం పట్టుకొన్నట్లు ఆశాఖ అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా పట్టుబడిన ఎర్రచందనం విలువ వెల్లడించరు. కొందరు అధికారులు, సిబ్బంది కలసి చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పట్టుబడిన ఎర్రచందనం దుంగలను గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.

భయపెట్టే కాంచన!



✍ అల్లూరు రహీం

ప్రేక్షకులను భయపెట్టి వారి అభిమానాన్ని పొందడం చాలా కష్టం. కాని నృత్య దర్శకునిగా వుంటూ దర్శక, నటునిగా మారిన రాఘవ లారెన్స్ కాసింత భయం, ఉత్కంఠత, వినో దాన్ని మేళవించి గతంలో తీసిన 'ముని' చిత్రానికి మంచి ఆదరణే లభించింది. ఆ విజయం తాలుకు ధీమాతో అవే అంశాలను మేళవించి తీసిన చిత్రమే కాంచన. ముని చిత్రానికి కొనసాగింపుగా సాగే ఈ చిత్రంలో చీకటి, సంగీతం, నీడలాంటి ఆకారంతో ప్రేక్షకులను బాగానే బెదరకొట్టాడాయన. ఓ ఉత్కంఠత కలిగించే సన్నివేశం, ఆ తర్వాత ఓ కామెడీ సన్నివేశంతో చిత్రాన్ని లాగేశాడు. మధ్యలో నాలుగు పాటలు, వాటిలో తనదైన ధోరణిలో స్టెప్పులతో అదరగొట్టాడు. చిత్రంలో హిజ్రాలను నీచంగా చూడకూడదన్న సందేశం కూడా వుంది. చిత్రం నిడివి మూడుగంటలు కావడం, కాసింత అరవయాగీ వుండడంతో చిత్రం చూస్తున్న ప్రేక్షకులకు చివరన విసుగు వస్తుంది. చిత్రంలో ముస్లింల ఆత్మలు దెయ్యాలుగా మారినట్లు చూపడం, ఉగ్ర నరసింహస్వామి దేవస్థానంలోనికి దెయ్యం విన్నపం చేసిమరీ వెళ్లడం అతిగా తోస్తాయి. ఇస్లాం ధర్మం ప్రకారం ఓ వ్యక్తి ఏరూపంలో చనిపోయినా దెయ్యంగా మారదు. ఒకసారి మట్టిలో పాతిపెట్టిన శవం (ముర్దా) తాలుకు కర్త, కర్మ క్రియలన్నీ జడ్జిమెంట్‌డే నాడే నిర్వహించబడతాయన్న కనీస సమాచారం కూడా దర్శకునికి తెలిసినట్లు లేదు. ఆత్మలు ఆవాసముండే గ్రౌండ్‌లో హీరో క్రికెట్ ఆడను వెళ్లినప్పుడు జరిగే ప్రకృతి మార్పులు, ప్రక్కనున్న ఇంటి యువతి పైటతోపాటుగా వచ్చే దెయ్యం, అది దుప్పట్లో దూరడం, ఏడుపు, గుర్రపుస్వారీ, ఇంట్లో పూజలకు తిరగబడడం వంటి సన్నివేశాలు ఉత్కంఠత కలిగిస్తాయి. కాంచన ఆవహించిన తర్వాత లారెన్స్ మహిళలా చేసే చేష్టలు అతని ఫిజిక్ వల్ల వికారంగా తోచవు.

చిత్ర సమీక్ష

చాలా రోజుల తర్వాత చిట్టిపొట్టి దుస్తులతో వెండితెరపై కనిపించిన లక్ష్మీరాయ్, లారెన్స్‌కు ఒక ఘాటు ముద్దు ఇస్తుంది. పాటల్లోనూ నైసుగా దేహప్రదర్శన చేసింది. హిజ్రా కాంచనగా ప్రముఖ నటుడు శరత్‌కుమార్ నటన బాగుంది. ఆయన ఈ పాత్ర పోషణవల్లే ఆ పాత్రకు కళ వచ్చింది.

ఇక చిత్ర కథలోనికి వెళ్తే రాఘవ (లారెన్స్)కు దెయ్యాలంటే భయం. పగలంతా బలాదూర్‌గా తిరిగినా సాయంత్రం ఆరుగంటలకు ఇంటికి వచ్చేస్తాడు. రాత్రి వేళ బాత్రూంకు వెళ్లాలన్నా తల్లి(కోవై సరళ) తోడుండాల్సిందే. ఓ రోజు రాఘవ కొత్త గ్రౌండ్‌లో క్రికెట్ ఆడను స్టంప్ దింపనుపోగా వాటికి రక్తం తగులుతుంది. ఆ రక్తంతోపాటుగా రాఘవ ఇంటికి మూడు ఆత్మలు వచ్చేస్తాయి. రాత్రివేళల్లో ఇంట్లోని రాఘవ అన్న(శ్రీమాన్), వదిన(దేవదర్శిని)కి కనపడుతూ భయపెడతాయి. వివిధ పూజల అనంతరం ఆ ఇంట్లో దెయ్యాలు ఆవాసం వున్నాయన్న నిర్ధారణకు కోవైసరళ వస్తుంది. షాపింగ్‌మాల్‌లో రాఘవ ఎర్ర చీర పట్ల ఆసక్తి కనపర్చడం, పసుపు రాసుకొని స్నానం చేయడంతో ఇంట్లోవాళ్లు ఆందోళనకు గురవుతారు. అతన్ని దర్గాకు తీసుకవెళ్తారు. అక్కడ ప్రత్యేక పూజలో కూర్చోబెట్టిన ముజావర్లను కాంచన(శరత్‌కుమార్) గత్తర పెడుతుంది. మంత్రజలం చల్లుతాననడంతో తన దీన కథ వినిపిస్తుంది. కాంచన అసలు పేరు కార్తీక్. హార్మోన్ల లోపంతో పుట్టాడని ఇంట్లోవాళ్లు తరిమేస్తారు. ఇతన్ని అక్బర్ (బాబ్‌ఆంధోని) చేరదీస్తాడు. అతనికి అప్పటికే మతిస్థిమితం లేని కొడుకుంటాడు. కాంచన కష్టపడి బతుకుతూ మరో హిజ్రా గీతను చేరదీస్తుంది. ఆమెను ఎంబిబిఎస్ చదివిస్తుంది. గీత హాస్పిటల్ పెట్టడం కోసం ఒక స్థలం కొంటుంది. దీనిపై ఎమ్మెల్యే(దేవన్) కన్నుపడుతుంది. దాన్ని అతను ఆక్రమించగా వెళ్లి అడిగిన కాంచనను అక్బర్, అతని కొడుకును కిరాతకంగా చంపి ఆ స్థలంలోనే పూడ్చేస్తారు. ఆ ముగ్గురు ఆత్మలై రాఘవను ఆవహించి దేవన్‌ను చైత్ర పౌర్ణమి రోజు చంపేస్తాయి. కాంచన చిర కాల కోరికైన హాస్పిటల్ కట్టడాన్ని రాఘవ నెరవేర్చడంతో సినిమా ముగుస్తుంది.

జెనీలియాకు పెళ్లి



హీరోయిన్ జెనీలియా పెళ్లికూతురు కాబోతుందన్నే వార్త ముంబాయిలో కోడైకూస్తుంది. హిందీ హీరో రితేష్ దేశ్‌ముఖ్‌కు, ఆమెకు కొన్నేళ్లుగా ప్రేమాయణం సాగుతోంది. వీరిద్దరు పెళ్లి చేసుకొంటారని వార్తలు వినిపించాయి. పెళ్లికంటే కెరీర్ ముఖ్యమని జెనీలియా చెబుతూ వచ్చింది. అటువంటిది ఇటీవల టోరంటోలో నిర్వహించిన సినీవేడుకకు జెనీలియా, రితీష్ కలసి వెళ్లారట. అక్కడే పెళ్లి నిర్ణయం తీసుకొన్నారట. జెనీలియా చేతిలో ప్రస్తుతం మూడు సినిమాలున్నాయి. వీటి షూటింగ్ అయ్యాక పెళ్లి చేసుకొంటుందట.

మీ రుణం తీర్చుకోలేనిది!



అందాల అనుష్క తెలుగు, తమిళ భాషల్లో నటిస్తూ బిజీగా వుంది. రంప చోడవరం చిత్రం షూటింగ్ గ్యాప్‌లో మీరు ఏ భాషకు ప్రాధాన్యతనిస్తారంటే సమాధానంగా ఒకట్రెండు సినిమాలు ఇతర భాషల్లో చేసే సరికి మీరు ఈ ప్రశ్న అడుగుతున్నారు. నాకిది వర్తించదు. నా కెరీర్ మొదలైంది తెలుగులోనే. నా మొదటి ప్రాధాన్యం కూడా తెలుగుకే. చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టిన తొలిరోజుల్లో అనుకొనేదాన్ని ఇంతకీ ఇక్కడ ఇమడగలుగుతానా? అని అలాంటిది నాకు ఎంతో అనుకూలమైన వాతావరణాన్ని కల్పించింది తెలుగు పరిశ్రమ. తొలి సినిమాతోనే తెలుగు ప్రేక్షకులు నన్ను గుర్తించారు. వాళ్ల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. నేను చదివే స్క్రిప్ట్‌లలో తెలుగులో చెయ్యలేనన్నప్పుడే ఇతర భాషల నుంచి వచ్చిన అవకాశాలను ఒప్పుకొంటానంది అనుష్క.

శారద జీవితంపై సినిమా



ఊర్వశి శారద జీవితం వెండితెరపై ఆవిష్కరింపబడుతుంది. తెనాలికి చెందిన శారదకు మళయాళంలో కూడా ఎందరో అభిమానులున్నారు. ఆమెను శారదమ్మ అని అప్యాయంగా పిలిచే వారెక్కువ. రెండుసార్లు మళయాళ చిత్రాల ద్వారా జాతీయ ఉత్తమనటి అవార్డు అందుకున్న శారద జీవితాన్ని ఆధారం చేసుకొని 'నాయకి' పేరిట చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జయరాజ్ దర్శకుడు. సినిమాలో యవ్వనంలో వున్న కథా నాయికగా పద్మప్రియ కనపడుతుంది. వృద్ధాప్య పాత్రను శారదనే పోషిస్తుంది.

సునీల్ సరసన తాప్సీ



అవును... ఇది నిజమే. గ్లామర్ హీరోయిన్ తాప్సి సునీల్ సరసన నటించను ఒప్పుకొంది. హిందీలో విజయవంతమైన 'తను వెడ్స్ మను' సినిమాను తెలుగులో సూపర్‌గుడ్ సంస్థ రీమేక్ చేస్తుంది. అక్కడ కలెక్షన్ల వర్షం కురిపించిన ఈ సినిమా హీరోయిన్ కంగన రనౌత్‌కు ఎంతో పేరు తెచ్చిపెట్టింది. ఈ సినిమాను ఇంతకు ముందే చూసిన తాప్సిని హీరోయిన్‌గా నటిస్తావా అంటే మారు మాట్లాడకుండా ఒప్పుకొందట. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ దర్శకుడు.

బాయ్ ఫ్రెండ్ లేడు!



బాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకపోతున్న హీరోయిన్ కత్రినా కైఫ్ తనకు, హీరో సల్మాన్‌ఖాన్‌కు మధ్య ఎటువంటి బంధం లేదంటుంది. నాకు బాయ్‌ఫ్రెండ్ లేరంటూ నా స్నేహితురాళ్ల ఆట పట్టిస్తుంటారు. సల్మాన్‌ఖాన్ 20 ఏళ్లుగా నటిస్తున్నాడు. కొన్ని చిత్రాల్లో మేమిద్దరం కలసి నటించాం. మా జంట తెరపై ఆకట్టుకొంది. ఆయన నాకో మంచి మిత్రుడు. ఖాన్‌తో నటించను ఏ ఇబ్బంది పడను. మా ఇద్దరి సినిమా ప్రయాణంలో ఆయన జెంటిల్‌మెన్‌లాగే ప్రవర్తించారు. అందుకే మళ్లీ సల్మాన్‌ఖాన్‌తో 'ఏక్ ధా టైగర్' లో కలసి నటిస్తున్నానంది కత్రినా. నమ్ముదామా?

పాడుపు సంఘాలకు వరి కొనుగోలు కేంద్రాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి.

ధాన్యం పండించిన రైతులకు ఖచ్చితమైన గిట్టుబాటు ధర లభించేందుకు వీలుగా పాడుపు సంఘాల ద్వారా జిల్లాలో 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ రెడ్డి తెలిపారు. నెల్లూరు ఆటో నగర్‌లోని క్యాటాన్ సెంటర్‌లో ఇందిర క్రాంతి పథం గ్రూపు సభ్యులతో జరిగిన ధాన్యం కొనుగోలు అవగాహన శిక్షణా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు పండించిన పంటకు లాభం చేకూరిందన్న సంతృప్తి రైతు పొందేందుకు వారిలో ఆత్మవిశ్వాసం కల్గించాలన్నారు. పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ముందుగా ఈ సీజన్‌లో ఏయే మండలాల్లోని గ్రామాల్లో వరి పండిస్తున్నారో ఆయా రైతుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు సేకరించాలన్నారు. పాడుపు సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కొన్ని జిల్లాలు విజయం సాధించాయన్నారు. ప్రగతి పథంలో వున్న జిల్లాలకు మన జిల్లా నుంచి పాడుపు మహిళలను అవగాహన కోసం పంపుతామన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన పిదప ధాన్యం కొనాల్సిన తీరు, నాణ్యత, తేమ శాతం గుర్తించడం మొదలు రైసుమిల్లుకు తరలించేందుకు పాటించాల్సిన నియమాలు, తీరుతెన్నుల గూర్చి పాడుపు సంఘ సభ్యులు అవగాహన కల్గి వుండాలన్నారు. పాడుపు సంఘాల సభ్యులు ఈ బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తారని ఈ బాధ్యత అప్పజెప్పినట్లు కలెక్టర్ చెప్పారు. జాయింట్ కలెక్టర్ సౌరభ్ గౌర్ కూడా పాడుపు సంఘ సభ్యులకు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సదస్సులో వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త రమేష్‌బాబు, డిఎస్ఓ ఉమామహేశ్వర రావు, మార్కెటింగ్ ఎడి గౌస్‌బాషా, ఫుడ్ కార్పొరేషన్ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మయ్య ఇంజనీరింగ్ కాలేజిలో మంచి విద్య!

• అత్యాధునిక విద్యాబోధనతో ముందడుగు


క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన కాలేజి విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఎఓ మల్లిఖార్జున.

జిల్లాలో పలు ఇంజనీరింగ్ కళాశాలలు వున్నప్పటికీ విద్యాబోధన, ఆధునిక వసతులతో నార్తురాజుపాళెంలో ఏర్పాటైన బ్రహ్మయ్య ఇంజనీరింగ్ కాలేజి తన ప్రత్యేకతను చాటుకొంటుంది. జాతీయ రహదారికి ఆనుకొని 11 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఈ కళాశాలను ఏర్పాటు చేశారు. అధునాతన భవనాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అక్కడి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. కంప్యూటర్ ల్యాబ్, ఇంటర్నెట్, డిజిటల్ లైబ్రరీ, వివిధ సబ్జెక్టులలో నిష్ణాతులైన అధ్యాపక బృందంతోపాటు మంచి ఆహారాన్ని అందించే మెస్, యువతీ యువకులకు ప్రత్యేక హాస్టల్ వసతి కలదు. కళాశాల ఏర్పాటు గురించి ఛైర్మన్ గిలకా బ్రహ్మయ్య యాదవ్ చెబుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంజనీరింగ్ విద్యను గ్రామీణ ప్రాంతాల వారికి అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశ్యంతోనే ఇక్కడ కళాశాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల పట్ల వ్యక్తిగత పర్యవేక్షణ కల్గి వుండడంతోపాటు వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు సెమినార్లు నిర్వహించడం, సేవాభావాన్ని కల్గించేందుకు రక్తదాన శిబిరాలు నిర్వహించడం చేస్తున్నట్లు బ్రహ్మయ్య తెలిపారు. వివిధ ఇంజనీరింగ్ కోర్సులతోపాటు ఎంబిఎ కోర్సులు కళాశాలలో అందుబాటులో వున్నాయన్నారు. పలువురు విద్యార్థులు వివిధ కంపెనీలు, బహుళజాతి సంస్థలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపికై ఉద్యోగాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరిప్రకాష్, ఎఓ మల్లిఖార్జున్‌లు తెలిపారు.



పారిశ్రామికవేత్తలు

మొదటి పేజీ కొరవ

ఫైళ్లు చూస్తున్నారే తప్ప, జగన్‌ను జైలుకు పంపించ దానికి చాలినంత సమాచారం వారి వద్ద ఇప్పటికే వుందన్నది నిపుణులు చెప్పే మాట.

హవాలాతోనే తంటా

దుబాయి, మారిషస్ వంటి విదేశాలు, కల కత్తా, జైపూర్, బొంబాయి వంటి నగరాలకు వేల కోట్ల రూపాయల నల్లధనాన్ని తరలించి, తెల్లధ నంగా తన కంపెనీలలోకి ప్రవహింప చేసుకొన్నా దన్నది జగన్ మీద వస్తున్న ప్రధాన ఆరోపణ. దీనికి అనుసరించిన హవాలా మార్గమే ఇప్పుడు ఆయన్ను ఇరకాటంలో పెడుతున్నది. ఆయా దేశాలు, నగ రాల నుంచి వచ్చిన పెట్టుబడులకు చట్టబద్ధమైన సమాధానం చెప్పడం జగన్ తరం కాదని నిపు ణులు అంచనా వేస్తున్నారు.

సమాధులు త్రవ్వితే అంతే సంగతులు

శంకరరావు హైకోర్టుకు చేసిన ఫిర్యాదు, పలు కంపెనీలు ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొంది, అందుకు ప్రతిఫలంగా ఇచ్చే లంచాన్ని జగన్ కంపెనీలలో వాటాలుగా చెల్లించాయని. హైకోర్టు కూడా అంతవరకే కేసు పరిశీలన చేస్తు న్నది. అయితే, సిబిఐ అధికారులు కంపెనీల పెట్టు బడులతోపాటు, వారికి ప్రభుత్వం నుంచి అందిన ప్రయోజనాలకు సంబంధించిన ఫైళ్లను కూడా పరి శీలన చేస్తున్నారు. చాలా ప్రమాదకరమైన పరిణా మం అది. ఆ ఫైళ్లు చూడడం అంటే, సమాధులు త్రవ్వడంతో సమానం. తనను ఎవరూ ఏమీ చేయ లేరనే ధైర్యంతో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పారిశ్రామిక వేత్తలకు అడ్డదిడ్డంగా ప్రభుత్వ ఆస్తులను దోచి పెట్టాడు. ఫైళ్ల మీద కళ్లు మూసుకొని సంతకాలు పెట్టాడు. ఐఎఎస్ అధికారుల చేత పెట్టించాడు. రూల్స్, రెగ్యులేషన్స్ వంటి వాటిని పట్టించుకోనే లేదు. చట్టాలను లెక్క చేయలేదు. ఒక్కొక్క ఎస్ఇజడ్, ఒక్కొక్క గని కేటాయింపు, ఒక్కొక్క కాంట్రాక్ట్ పని, ఒక్కొక్క భూపందారం, ఒక్కొక్క పన్నుల మినహా యింపు, ఒక్కొక్క ఓడ రేవు అనుమతి, ఒక్కొక్క పరిశ్రమ మంజూరు ఇట్లా ఏది చూసినా ఒక పెద్ద కుంభకోణం బయటపడక తప్పదు. అదే జరిగితే, ఆంధ్రరాష్ట్ర ఆర్థిక వ్యవస్థే కుప్పకూలి పోతుంది. అందుకు కారణం, ఈరోజు వెలుగులో వున్న ప్రతి పారిశ్రామిక సంస్థ ఏదో ఒక రూపంలో ప్రభుత్వ ప్రయోజనాల ద్వారా మాత్రమే వృద్ధిలోకి వచ్చినవి కావడం. ఈ దోపిడీ మీద లోతుగా విచారణ జరిపితే రాష్ట్రంలోని ముప్పాతిక భాగం కంపెనీల యజమానులు జైలులో వుంటారు. లేదా, వారి కంపెనీలు స్థంభించిపోతాయి. దానితో ఆయా కంపెనీల యాజమాన్యాలు తీవ్రమైన మానసిక అశాంతికి లోనౌతున్నాయి. ఎప్పుడేమి జరుగు తుందో, ఏ లోపం బయట పడుతుందో అని హడలి చస్తున్నారు.



జగన్‌లో తెగింపు

జగన్ మాత్రం ఇవన్నీ పట్టించుకోవడం లేదు. జరగాల్సింది జరగక మానదన్న వేదాంత ధోరణిలో తెగింపుకు వచ్చేశాడు. తన కంపెనీల మీద సిబిఐ అంత ఒత్తిడి తెస్తున్నా లెక్క చేయకుండా కర్నూలు జిల్లాలో ఓదార్పు యాత్ర చేస్తున్నాడు. జనం మధ్య తిరుగుతున్నాడు. రాజీ ఆలోచన లేకుండా నేరుగా సోనియాగాంధీ మీద విమర్శలు కురిపిస్తున్నాడు. సాక్షి టీవీ ఛానల్‌లో సోనియాగాంధీ మీద ప్రత్యేక కార్యక్రమాలు ప్రసారం అవుతున్నాయి. ఆమె వల్ల దేశ రక్షణకే ప్రమాదమనే వ్యాఖ్యలు చేస్తున్నారు.

జగన్‌లో తెగింపుకు కారణం – తానెంత ప్రయ త్నం చేసినా సిబిఐ దర్యాప్తును తప్పించుకోలేమన్న అభిప్రాయం. తానెంత ప్రాకులాడినా తప్పించుకొనే అవకాశం లేదు కాబట్టి, కొంతకాలం జైలుకు వెళ్ల దానికి మానసికంగా సిద్ధమైనట్లు చెప్తున్నారు. ఒకసారి జైలుకు వెళ్లి వచ్చేస్తే, ఇక ఆ తర్వాత ఏ ఇబ్బందీ వుండక పోవచ్చునన్నది ఆయన ఆలోచన అట. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలను తన తల్లికి, వైవి.సుబ్బారెడ్డి వంటి దగ్గరి బంధువులకు అప్ప చెప్పే ప్రయత్నంలో వున్నాడని చెప్తున్నారు.

దిం‌పుడు కళ్లం ఆశ

చివరి ప్రయత్నంగా సుప్రీంకోర్టు స్టే కోసం ప్రయత్నం జరుగుతున్నది. నూటికి తొంభై పాళ్లు స్టే వచ్చే అవకాశం లేదన్నది న్యాయనిపుణుల అభిప్రా యం. ఒకరకంగా అది దింపుడు కళ్లం ఆశ మాత్రమే. అయితే దానివల్ల జగన్ భయపడి పోతు న్నాడని ప్రచారం చేసే అవకాశం ప్రతిపక్షాలకు లభిస్తున్నది. మడమ తిప్పని వాదిగా తనను తాను గొప్పగా వర్ణించుకొన్న జగన్‌కు అది చాలా ఇబ్బందికర పరిణామం. కానీ సుప్రీంకోర్టు దయ తలిస్తే, జైలులో చిప్ప కూడు తినే దుర్గతి తప్పు తుందన్న ఆశతో ఆ ప్రయత్నం చేస్తున్నాడు. ఈ దశలో సోనియాగాంధీతో కానీ, కాంగ్రెస్ పార్టీతో కానీ రాజీపడడం జరిగే పని కాదన్నది ఆయన అభిప్రాయం. ఇప్పుడు రాజీ అంటే, తన రాజకీయ భవితవ్యాన్ని శాశ్వతంగా సమాధి చేసుకోవడమే అవుతుంది. తాను కలలు కనే ముఖ్యమంత్రి పీఠం ఇక ఈ జన్మకు దక్కదు. జనంలో తనకున్న సమ్మో హన శక్తి దృష్ట్యా ఈ సమస్యను ఏదో ఒక రకంగా అధిగమిస్తే, భవిష్యత్తులో తన రాజకీయ కోరికలు తీరుతాయన్న అంచనాతో, తాత్కాలిక జైలు జీవితానికే మొగ్గు చూపుతున్నాడు జగన్.

దండకాలు

16వ పేజీ కొరవ

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పేరుతో ఆనం సోదరులిద్దరూ పిండారీల కంటే హీనంగా ప్రవర్తిస్తు న్నారు. ఏ విభాగాన్నీ వదలి పెట్టడం లేదు. మునిసి పల్ కాంట్రాక్టర్ల సమావేశం ఒకటి ఏర్పాటు చేసి, వారు చేసే ప్రతి పని విలువలో 3శాతం కప్పం కట్టమన్నారు. మామూలుగా ఇచ్చే మామూళ్లకు ఇది అదనమట. నగరంలోని పెద్ద విద్యా సంస్థలన్నిటికీ ఫర్మానాలు వెళ్లాయి – ఎవరెంత నజరానా చెల్లిం చాలో. లే అవుట్లు వేసుకొనేవారిని, అపార్టుమెంట్లు కట్టుకొనే వారిని కూడా వదలి పెట్టలేదు. దేముడి తిరునాళ్లకు కుక్కల సందడి పలె వుంది వీరి ప్రవ ర్తన. ముఖ్యమంత్రి పర్యటన అంటే, పూర్తిగా అధి కారిక కార్యక్రమం. ఖర్చు మొత్తం ప్రభుత్వ పద్దులో నమోదు అవుతుంది. అధికారులు చూసుకొంటారు. దానికి అదనంగా ఎమ్మెల్యేలు, మంత్రులు పెట్టే ఖర్చు వీధుల అలంకరణకు మాత్రమే. ఆ పేరుతో ఇంత వ్యవస్థీకృత దండకాలు జరపడం, ఆనమోళ్ల అవి నీతి దాహానికి రుజువు తప్ప వేరు కాదు. డబ్బు కక్కుర్తి అనేది వారికొక వ్యసనంగా మారిపోయింది. ఎవరేమనుకొన్నా ఫర్వాలేదు, జేబులు నిండుగా వుంటే చాలనుకొనే ధోరణి అలవాటు పడింది. ఎంత దౌర్భాగ్యం?

నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

యూనివర్శిటీకి కాకుటూరులో స్థలం!

విక్రమ సింహపురి యూనివర్శిటీకి ఎట్టకేలకు కాకుటూరు వద్ద 83 ఎకరాల స్థలం కేటాయిం చారు. ఇక్కడ 12.5 కోట్ల రూపాయలు వ్యయపరచి నిర్మించే యూనివర్శిటీ భవన సముదాయానికి ముఖ్య మంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి 24వ తేది శంకుస్థాపన చేస్తారు. యూనివర్సిటీకి నగర శివార్లలో పలు ప్రాంతాలలో స్థలం కేటాయింపు చేస్తారని వార్తలు వచ్చినా చివరకు కాకుటూరే ఖరారయ్యింది.

సాయిబాబా గురుపూర్ణిమ

నెల్లూరు గాంధీనగర్‌లోని సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ ఉత్సవాలు 15వ తేది మొదలై ఘనంగా జరుగుతున్నాయి. మహాన్యాస పూర్వక, ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర సహస్ర నామ పూజల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. 21వ తేది బాబా నగరోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ప్రతిరోజూ సాయంత్రం కో – ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆవరణలో డాక్టర్ మైలవరపు శ్రీని వాసరావు మహాభారతంపై ఇస్తున్న ఉపన్యాసాలు శ్రోతలను కట్టిపడేస్తున్నాయి. మందిరంలో ఉత్సవా లను ఘనంగా జరపడంలో చైర్మన్ మన్నెం అమర నాధ్‌రెడ్డి శ్రమ ప్రశంసనీయం.

మరణం

నెల్లూరు మధ్వపతివారివీధిలో ప్రజల డాక్టర్‌గా పేరుగాంచిన డాక్టర్ బి.మాలకొండయ్య తల్లి వెంకట సుబ్బమ్మ 16తేది మరణించారు. ఈమె మిగతా ముగ్గురు కుమారులు వెంకటనారాయణ, వెంకట సత్యనారాయణ, డాక్టర్ బి.శ్రీనివాసరావు కూడా వివిధ రంగాలలో నిష్ణాతులు. ప్రముఖ షుగర్ డాక్టర్ డాక్టర్ రవిశంకర్ ఈమె మనవడు. మరణానంతరం ఈమె నేత్రాలను మాడరన్ ఐ హాస్పిటల్‌కు దానం చేశారు. తల్లిని కోల్పోయిన వీరి కుటుంబానికి మా సానుభూతి.

చేసిన పనులకే మళ్లీ టెండర్లు

16వ పేజీ కొరవ

అయినాసరే, ఎమ్మెల్యేగారిలో మార్పు లేదు. ఎవరేమనుకొన్నాసరే ఈ టెండర్ పేరుతో వస్తుంద నుకొన్న అవినీతి సొమ్మును వదలుకోవడానికి ఇష్ట పడడం లేదు. టెండర్ల విషయంలో పట్టు వదలడం లేదు. ఆయన మాట కాదని జిల్లాలో ఏ అధికారీ బ్రతకలేడు కాబట్టి, చివరకు ఆయన మాటే చెల్లు బాటు అవుతుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

● ఉత్తమ విద్యకు చిరునామా

ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజ్!


నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

విద్యారంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని, గుర్తింపును సంపాదించుకొన్న సంస్థ వాకాడులోని నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి (ఎన్‌బికెఆర్) ఇంజనీరింగ్ కాలేజ్. విద్యార్థులకు చక్కని, నాణ్యమైన విద్యను అందించడంతోపాటు అన్ని రంగాల్లో నిష్ణాతులను చేయడమే లక్ష్యంగా ఈ కళాశాల పని చేస్తోంది. 1979లో ఏర్పాటైన ఈ కళాశాల ఆంధ్ర రాష్ట్రంలోనే ప్రైవేట్ రంగంలో రెండవ కళాశాలగా నిలచింది. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఈ సంస్థను ఏర్పాటు చేశారు. స్థాపించిన నాటి నుండి విద్యాబోధన, మౌలిక వసతుల కల్పన, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ టెక్నాలజి కళాశాల ముందుంటోంది. గ్రామీణ ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో జెఎన్‌టియూ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఐ.గోపాలరెడ్డి సారధ్యంలో నిష్ణాతులైన అధ్యాపక బృందం ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న ఈ కళాశాల దేశవ్యాప్తంగా చక్కని పేరు ప్రతిష్టలను కల్గి వుంది.

అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్ ఇనుస్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్ తదితర కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చిన కళాశాలలో అధునాతన ల్యాబొరేటరీలు, కంప్యూటర్ సెంటర్లు, విశాలమైన తరగతి గదులతో ఎస్వీ యూనివర్శిటీ పరిధిలోనే ఉత్తమ కళాశాలగా నిలుస్తోంది. 185 ఎకరాల సువిశాల స్థలంలో ఏర్పాటై వుండే కళాశాలలో విద్యార్థులకు చదువుతోపాటు, క్రీడలు, పెయింటింగ్, సంగీతం తదితర అంశాలలో శిక్షణనిస్తూ వారిలోని సృజనాత్మక శక్తిని వెలికితీసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో తనవంతు కృషి చేస్తుంది. 15 ఎకరాల స్థలంలో బాస్కెట్‌బాల్, టెన్నిస్, వాలీబాల్ కోర్టులు, క్రికెట్ పిచ్, ఓపెన్ ఆడిటోరియం నిర్మితం కావడం విశేషం. కళాశాల విద్యార్థులు 'టోఫెల్', 'జిఆర్ఇ', 'గేట్' పరీక్షల్లో జాతీయస్థాయిలో ప్రతిభ కన్పరుస్తున్నారు. ఎఐసిటిఇ న్యూఢిల్లీ వారిచే రెండుసార్లు ఎన్‌బిఏ అక్రిడేషన్ పొందడమే కాకుండా నాక్'ఏ' గ్రేడ్ సైతం సాధించింది. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కరస్పాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కళాశాల మరింతగా అభివృద్ధి పథంలో నడుస్తోంది. వివిధ సంస్థలు, పరిశ్రమలు సెమినార్‌లు, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనంగా వుంటోంది. ఇక్కడ ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసి పలువురు విద్యార్థులు పేరొందిన వివిధ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపికై ఉన్నత స్థానాల్లో వున్నారు. కరస్పాండెంట్ రామ్‌కుమార్‌రెడ్డి, కాలేజి ఛైర్మన్ ఐ.గోపాలరెడ్డి, డైరక్టర్ విజయకుమార్ రెడ్డి సహకారంతో కళాశాలను మరింతగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌శ్రీ చెప్తున్నారు.






● ఘనంగా చెరుకుపల్లి పిచ్చిరెడ్డి

లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు సభ!

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో సిపిఆర్ కళ్యాణ మండపం అధినేత చెరుకుపల్లి పిచ్చిరెడ్డికి హరివిల్లు క్రియేషన్స్ లైఫ్‌టైమ్‌అచీవ్‌మెంట్ అవార్డు-2011ను ప్రధానం చేసింది. జూలై 16వతేది శనివారం నాడు టౌన్‌హాలులో జరిగిన ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, పిచ్చిరెడ్డి అభిమానులు, బంధుమిత్రులు తరలిరావడంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, అమరావతి హోటల్ నిర్వహకుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ పది మందికి సాయపడుతున్న పిచ్చిరెడ్డికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేయడం సంతోషకరమన్నారు. హరివిల్లు క్రియేషన్స్ స్థాపకుడు దోర్నాల హరిబాబు మాట్లాడుతూ పిచ్చిరెడ్డికి తమ సంస్థ ఆధ్వర్యంలో అవార్డునివ్వడం ఎంతో గౌరవంగా భావిస్తున్నామన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన టివీ నటులు లోహిత్, నందకిషోర్‌లు మాట్లాడుతూ డబ్బు సంపాదనే కాకుండా సేవాదృక్పదం కల్గివున్న పిచ్చిరెడ్డి లాంటి వారిని సన్మానించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ హోటల్ నిర్వాహకుడు గ్రోసు గోపాలయ్య, గువ్వల సుందరరామిరెడ్డి, ఊటుకూరు బ్రహ్మారెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పిచ్చిరెడ్డిని సన్మానిస్తున్న గువ్వల సుందరరామిరెడ్డి, కృష్ణారెడ్డి, మురళీకృష్ణ గోపాలయ్య, డాక్టర్ అనిల్ తదితరులు.





Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

చేసిన పనులకే మళ్లీ టెండర్!

● ఒకటిన్నర కోటి రూపాయలు వివేకా జేబులోకి.



చిల్డ్రన్స్ పార్కు రోడ్డులో ఇదివరకే నిర్మాణం జరిగివున్న డ్రైనేజి.

రామలింగాపురం నుంచి చింతారెడ్డిపాళెం వెళ్లే చిల్డ్రన్స్ పార్కు రోడ్డు నిర్మాణం రాజకీయవాదుల దోపిడీకి అడ్డాగా మారిపోయింది. చేసిన పనులకే మళ్లీ టెండర్లు పిలిచి, ఇచ్చిన బిల్లులనే మళ్లీ మళ్లీ వ్రాసి మునిసిపల్ ఖజానాకు కన్నం పెట్టడానికి కాంట్రాక్టర్లు, ఎమ్మెల్యేలు తమ శక్తినంతా వినియోగిస్తున్నారు.

ఈ రోడ్డు కొత్తగా వేయడానికి రెండేళ్ల క్రితమే టెండర్లు పిలిచారు. అటు, ఇటు డ్రైన్ కాలువలు కట్టి, వెడల్పు పెంచి, పటిష్టంగా కొత్తగా రోడ్డు వేయడానికి 7కోట్ల యాభై లక్ష లతో టెండర్లు పిలిచారు. అప్పట్లోనే దీనిపై విమర్శలు వచ్చాయి. అంచనాను విపరీతంగా పెంచారని, అసలు ఖర్చు కంటే రెట్టింపు విలువకు టెండర్లు పిలిచారని గోల లేచింది. మరొకపక్క టెండర్ విలువ కంటే 9 శాతానికి తక్కువ ధరకు బిడ్ వేసిన కాంట్రాక్టర్‌ను కాదని, నాలుగున్నర శాతం అధికంగా బిడ్ వేసిన కాంట్రాక్టర్‌కు పని అప్ప చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి జోక్యం వల్లనే ఇది జరిగిందని, పేరుకు కాంట్రాక్టర్ తప్ప ఆ పని జరిపిస్తున్నది ఆయనే అని కూడా ఆరోపణలు వచ్చాయి. కానీ అధికారులు పట్టించుకోకుండా అధిక ధరకు వేసిన కాంట్రాక్టర్‌కే పని అప్ప చెప్పారు.

రోడ్డు వెడల్పు కోసం అటు ఇటు వున్న ఇళ్లను కూలగొట్టే ప్రక్రియలో వివేకానంద రెడ్డికి బాగా గిట్టుబాటు జరిగింది. రోడ్డు విస్తరణలో ఎంత స్థలం పోతున్నదీ లెక్క కట్టి, అంకణాల ప్రకారం ముడుపు చెల్లించిన వారి ఇళ్లను వదలిపెట్టి, ఇవ్వనివారి ఇళ్లను ధ్వంసం చేశారు. దాని వల్ల రోడ్డు పలు మలుపులు తిరిగింది. కొన్ని ఇళ్లను పూర్తిగా వదలిపెట్టి, మరికొన్నింటిని నిర్దాక్షిణ్యంగా కూలగొట్టారు. ఈ ప్రక్రియలో దాదాపు మూడు కోట్ల రూపాయల దండకాలు జరిగాయని చెప్తారు.

ఒక పక్క అంచనా కంటే అధిక ధర, మరొక పక్క దౌర్జన్యంగా విస్తరణలో స్థలం కోల్పోయే ఇళ్ల యజమానుల నుంచి దండకాలు చేసినా, ఎమ్మెల్యే గారి అవినీతి దాహం తీరినట్లు లేదు. ఇప్పుడు తాజాగా అదే సాయిబాబా గుడి వైపు డ్రైన్ కాలువ నిర్మాణం, కొంతమేర రోడ్డు విస్తరణ పేరుతో మళ్లీ టెండర్ పిలిచారు. దాని విలువ ఒకటిన్న కోట్ల రూపాయలు. ఇప్పటికే జరుగుతున్న రోడ్డు పనులకు కొత్తగా టెండర్లు పిలవడం ఎందుకో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

చేసిన పనికే మళ్లీ టెండర్ పిలవడం కాబట్టి, కాంట్రాక్టర్లు పోటీ పడ్డారు. అయితే ఎమ్మెల్యే గారు, వారినందరినీ పిలిచి తాను చెప్పినవారు తప్ప ఎవరూ టెండర్ వేయడానికి లేదని బెదరించాడు. దానితో సాధారణ కాంట్రాక్టర్లందరూ వెనక్కు తగ్గారు కానీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులలో ఒకడైన రామశివారెడ్డి మాత్రం భయపడకుండా 12శాతం తక్కువకు టెండర్ వేశాడట. ఎమ్మెల్యే గారి బినామీ కాంట్రాక్టర్లు సహజంగానే అధిక ధరకు టెండర్ వేశారు. రామశివారెడ్డి ఇట్లా తన మాట వినకుండా టెండర్ వేశాడని తెలియగానే వివేకానందరెడ్డికి కోపం నషాళానికి తన్నింది. తానే స్వయంగా మునిసిపల్ ఆఫీసుకు వెళ్లి, టెండర్లు తెరవడానికి లేదని అధికారులకు హెచ్చరిక చేశారాయన. ఈ టెండర్ అనుకొన్నట్లు ఆయన బినామీ కాంట్రాక్టర్‌కు దక్కి వుంటే, చిల్లిగవ్వ పని చేయకుండా కోటిన్నర రూపాయలు జేబులోకి వచ్చి వుండేవి. అది దక్కలేదనే ఆక్రోశంతో ఇంత అఘాయిత్యానికి దిగాడు.

దీనిపై సహజంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన జరిపి వుండాలి. కానీ ఆ చొరవ ఈసారి తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చింది. టిడిపి నెల్లూరు నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దీనిపై పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాడు. కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి జనమున్న యువనేత. రకరకాల కారణాల వల్ల ఒక దశాబ్దం పాటు అజ్ఞాతవాసంలో వున్న ప్పటికీ, ఆయన అనుచర బలం ఏమాత్రం తగ్గినట్లు లేదు. ఈ దోపిడీని అల్లరి పట్టించడంలో కోటంరెడ్డి శీనయ్య అనుకొన్న దానికంటే ఎక్కువ ఫలితం సాధించాడు. ఈనాడు దినపత్రిక ఆయనకు తోడుగా నిలిచింది. రాజకీయవాదుల అవినీతి దుర్మార్గాన్ని పారబట్టింది.

కొరవ 14వ పేజీలో

సిఎం పర్యటన పేరిట దండకాలు!

● మునిసిపల్ కాంట్రాక్టర్లు, అపార్ట్‌మెంట్ల నిర్మాతలు, స్కూళ్ల నిర్వాహకులవద్ద వసూళ్లు.



వెలసిన హోర్డింగులు




డివైడర్లపై ఫ్లెక్సీలు

తినమరిగిన కోడి ఇల్లెక్కి కూసిందట. నెల్లూరు నగరంలో ఆనం సోదరుల అఘాయిత్యాలు ఆ ధోరణిలో నడిచిపోతున్నాయి. ఉప్పు తినే వాడికి తినే కొద్దీ దాహం పెరుగుతుందన్నట్లు, జనం సొత్తు ఆరగించే కొద్దీ వీరి అవినీతి ఆకలి పెరిగిపోతున్నదే తప్ప తగ్గడం లేదు. వారెంత దాహంతో వున్నారో, ముఖ్యమంత్రి నెల్లూరు పర్యటన కోసం చేస్తున్న దండకాలను చూస్తే అర్థమైపోతుంది.

ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి, ఆర్జన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి మధ్య సంబంధాలు వంకరగా వున్నాయన్న నిజం లోకానికంతా తెలుసు. వాటిని సక్రమం చేసుకోవడానికి ఈ పర్యటనను ఒక అవకాశంగా వాడుకొంటున్నారు. అందుకోసం ఆయన నెల్లూరు పర్యటన అబ్బా అన్పించేట్లు జరిపించాలని కష్టపడుతున్నారు. గతంలో వైఎస్‌కు కట్టిన సంఖ్య కంటే అధికంగా స్వాగత తోరణాలతో నగరాన్ని అలంకరిస్తున్నారు. ముఖ్యమంత్రి కారు తిరిగే ప్రతి రోడ్డునూ పెళ్లి ఇల్లు వలె ముస్తాబు చేస్తున్నారు. పొదలకూరు రోడ్డులో పాతికేళ్ల వయస్సున్న పచ్చటి చెట్లను కూడా నిర్దాక్షిణ్యంగా నరికి పారేశారు. ముఖ్యమంత్రి మెహర్బానీకి తాము అమర్చిన ఫ్లెక్సీలు చెట్ల వల్ల సరిగా కనపడడం లేదట. వైఎస్ విగ్రహం ఆవిష్కరించే ప్రదేశాన్ని కళ్యాణ మండపం వలె తీర్చి దిద్దుతున్నారు.

ముఖ్యమంత్రులు వస్తుంటారు, పోతుంటారు. ఒక గంటకంటే ఎక్కువ వుండదు ఆ ముచ్చట. దానికోసం అన్ని పచ్చటి చెట్లను వేళ్లతో సహా పెకలించే అధికారం వీరికి ఎవరిచ్చారో అర్థమే కావడం లేదు. అడిగేవాడు లేడనే అహంకారం తప్ప, ఆ వృక్ష వినాశనానికి వేరొక కారణం లేదు.

కొరవ 14వ పేజీలో



Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.